TARAJYOTHI TELUGU DAILY
# తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్
మంగళవారం, ఏప్రిల్ 28, 2026 | సంపుటి - 20 | సంచిక 222 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## అమెరికా అధ్యక్షుడిపై కాల్పుల ఘటన

- భద్రతపై ఉలిక్కి పడేలా చేసిన వ్యక్తి
- ట్రంప్‌పై వ్యతిరేతతోనే దాడికి యత్నం
- నోట్ ద్వారా ప్లాన్ వెల్లడించిన దాడి నిందితుడు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న శ్వేతసౌధం కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల ఘటన నిందితుడు కోల్ టొమాస్ అలెన్ గురించి కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. అతడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా దాడికి ముందే ఓ నోట్‌ను తయారుచేసి, దానిని కుటుంబసభ్యులకు పంపాడు. ట్రంప్ గురించి.. పిల్లలను లైంగికంగా వేధించే వ్యక్తి, రేపిస్ట్, ద్రోహి వంటి పదాలను అందులో వాడాడని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2లో



## ఏయూ వర్సిటీ అంటే
# వందేళ్ల చరిత్ర

- ఆంధ్రాయూనివర్సిటీ..ఓ ఎమోషన్
- దేశంలో టాప్-3 విశ్వవిద్యాలయాల్లో ఒకటి
- శతాబ్ది ఉత్సవాలల్ఓ మంత్రి లోకేశ్

విశాఖపట్టణం : ఆంధ్ర యూనివర్సిటీ అంటే పేరు కాదని వందేళ్ల చరిత్రని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే తెలుగువారు పోరాడి తెచ్చు కున్న విశ్వవిద్యాలయం ఏయూ అని లోకేశ్ పేర్కొ న్నారు. ఏయూ అంటే ఒక ఎమోషన్ అని.. తానిక్కడ చదువుకుని ఉంటే బాగుండేదని అనిపిస్తోం దన్నారు. విశాఖలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగు తున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులను ఉద్దేశించి మంత్రి లోకేశ్ ప్రసంగించారు. 2లో

## బెంగాల్ ప్రచారం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది

- బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలంతా కలసి రావాలి
- బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ


న్యూఢిల్లీ,ఏప్రిల్27 : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారానికి సోమవారం సాయంత్రం తెరపడటంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో తాను జరిపిన విస్తృత పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మిక ఎదుగుదల పరంగా తనకెంతో ఉపకరించిందని ఆ లేఖలో పేర్కొన్నారు. 2



# అనేక వర్సిటీలకు ఆంధ్రా దిక్సూచి

## వర్సిటీలు మన చారిత్రక సంపద

- ఈ యూనివర్సిటీ కోసం ఎందరో కృషి చేశారు
- యూనివర్సిటీ అభివృద్ధికి 500 కోట్లు కేటాయింపు
- శతాబ్ది ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి






విశాఖపట్నం : దేశంలోని అనేక యూనివర్సిటీలకు ఆంధ్రా యూనివర్సిటీ నే దిక్సూచి అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌లో శతాబ్ది మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ మహోత్సవాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు మాట్లా డుతూ.. ఏయూ.. దేశంలోనే టాప్-5 యూనివర్సిటీల్లో ఒకటిగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఏయూకు రూ.500 కోట్ల నిధులు ఇస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. మరో రూ.500 కోట్లు కార్పస్ అభివృద్ధి కావాలని పేర్కొన్నారు. వర్సిటీలు మన చారిత్రక సంపద అని అభివర్ణించారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



## ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్
# ప్రమాణం

- ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా
- హాజరైన సిఎం రేవంత్ తదిరులు

హైదరాబాద్ : ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. తరువాయి 2లో

## బిఆర్ఎస్‌కు గతమే..
# భవిష్యత్ లేదు

## ఉద్యమంలో ఏది మాట్లాడినా చెల్లింది

- కవిత పార్టీ కుటుంబ గూడుపుఠాణి
- కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటా
- ఆయన చావాలని తానెప్పుడూ కోరుకోలేదు
- కాళేశ్వరంపై సిబిఐ విచారణ తరవాతే చర్యలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది.. భవిష్యత్ లేదని, ఉద్యమ సమయంలో అప్పుడు ఎలా మాట్లాడినా ప్రజలు సహించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటుపైనా ఆయన స్పందించారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటే అని విమర్శించారు. వాళ్లు తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పార్టీకి మనుగడ లేదు. అధికారంలో ఉన్న పదేళ్లు కూడా అలాగే మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలతో సంబంధాలు లేవు. కేసీఆర్ విశ్రాంతిలో ఉన్న ప్రజాప్రతినిధి. ఆయన చావును నేనెందుకు కోరుకుంటానన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే మాకు మంచిది. ఆయన మర మనిషో కాదో.. కుటుంబ సభ్యులకే తెలుసు. వివక్ష లేని పాలన మాది.. మాకు ప్రతిపక్షమే లేదు అని సీఎం అన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుపట్టలేదని సీఎం అన్నారు. సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని.. నివేదిక ఆధారంగా చర్యలు వద్దని కోర్టు చెప్పిందన్నారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ తర్వాతే చర్యలు ఉంటాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండటం తనకే మంచిదని, రాజకీ యంగా ఎదుర్కోవడం సులభమ వుతుందని వ్యాఖ్యానించారు. తరువాయి 2లో

## రాష్ట్రంలో దైన్యంగా
# రైతుల పరిస్థితి

- ధాన్యం కొనే దిక్కుల లేకుండా పోయింది
- బిజెపి ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం
- ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు
- బిఆర్ఎస్ ఎంపిలు ఉంటే రణరంగం సృష్టించేవారు
- తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్



హైదరాబాద్ : రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారి పోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. 2లో

## కోర్టుపై నమ్మకం పోయింది

- అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్

2



## త్యాగాల పునాదులపై
# ఏర్పడ్డదే బిఆర్ఎస్

- 14 ఏళ్ల పోరాటంలో తెలంగాను ఐక్యం చేసిన జెండా
- ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ : దశాబ్దాలుగా అన్యాయనికి గుర్రై నెత్తురు మండిన జాతి ఎత్తిన జెండానే గులాబీ జెండా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. కేటీఆర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జై కేసీఆర్, జైతెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..స్వీయ రాజకీయ శక్తిగా ఎదిగనప్పుడే సమస్యలకు చరమగీతం పాడవచ్చున్నారు. 2లో

# బిఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ బతికి ఉంటే తమకు అధికారం రాదని ఆయన కుటుంబ సభ్యులే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని ఆరోపించారు. అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. అయితే, వాళ్లంతా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాలను ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఇప్పటికే రెండుసార్లు ఓడించానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఓటమి కొత్త విషయం కాదని, అలాగే గెలుపు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని అన్నారు. మహేష్ గౌడ్ వర్సెస్ కేసీఆర్‌గా జరిగిన స్థానిక సంస్థల పోరులో కూడా కేసీఆర్ ఓటమి చవిచూశారని గుర్తు చేశారు. తాము వివక్ష లేకుండా ప్రభుత్వం నడుపుతున్నామని, అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు. ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.

## కోర్టుపై నమ్మకం పోయింది

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావడానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అంతరాత్మ ప్రబోధం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. 'న్యాయం జరుగుతుందన్న ఆశలు ఆవిరయ్యాయి. అందుకే మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాను. వ్యక్తిగతంగా గానీ, కనీసం నా తరఫు న్యాయవాది ద్వారా గానీ విచారణకు హాజరుకాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయితే, చట్టపరంగా తనకు ఉన్న హక్కుల ప్రకారం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, సోమవారం విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు కావడంతో హైకోర్టు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు బెంగాల్ ఎన్నికల వేడి, మరోవైపు కేజ్రీవాల్ చుట్టూ తిరుగుతున్న ఈ న్యాయ వివాదాలు దేశ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి.మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో పాటు ఇతర నిందితులను ట్రయల్ కోర్టు గతంలో విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్నారు. అయితే, ఈమె గతంలో కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. ఈ కేసు నుంచి ఆమె తప్పుకోవాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. గత ఏప్రిల్ 20 ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టివేశారు. 'న్యాయమూర్తుల నిజాయతీని లిటిగెంట్లు విచారించలేరు. కేవలం ఊహల ఆధారంగా రీక్యూసల్ కోరలేరు' అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, స్వయంగా న్యాయమూర్తికి వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాయవ్యవస్థపై కేజ్రీవాల్‌కు గౌరవం లేదని బీజేపీ విమర్శిస్తుంటే, తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

## అనేక వర్సిటీలకు ఆంధ్రా దిక్సూచి

ఏయూలో రూ.64 కోట్ల పనులు ప్రారంభించామని సీఎం చంద్రబాబు వివరించారు. సాధారణ వ్యక్తి.. అసాధారణ శక్తిగా మారాలని విద్యార్థులకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. విశాఖపట్నంకు గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం ఇకనుంచి గ్లోబల్ సిటీ.. ఇక అన్‌స్టాపబుల్ అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ యూనివర్సిటీ స్థాపించేందుకు అనేక మంది కృషి చేశారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. తొలి వీసీ కట్టమంచి రామలింగారెడ్డి ఈ యూనివర్సిటీకి బలమైన పునాదులు వేశారని చెప్పారు. రెండో వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్.. దేశ రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తు చేశారు. ఈ యూనివర్సిటీలో 58 దేశాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. రాష్ట్రంలో ఏయూని స్థాపించేందుకు అనేక మంది కృషి చేశారని సీఎం చంద్రబాబు అన్నారు. తొలి వీసీ కట్టమంచి ఈ విశ్వవిద్యాలయానికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. ఏయూలో వందేళ్ల పండగ జరుగుతోంది. తెలుగు వైభవానికి కూడా ఏయూ కృషి చేస్తోంది. ఈ విశ్వవిద్యాలయంలో 58 దేశాల విద్యార్థులు చదువుతున్నారు. విశాఖ ఇకనుంచి గ్లోబల్‌సిటీ.. దీని అభివృద్ధి అన్‌స్టాపబుల్. దేశంలోని అనేక యూనివర్సిటీలకు ఏయూనే దిక్సూచి. వర్సిటీలు మన చారిత్రక సంపద.. వాటిని కాపాడుకోవాలి. ఏయూ చరిత్రలో ఇవాళ ఎంతో ముఖ్యమైన రోజు. వందేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకోవడం సాధారణ విషయం కాదు. ఏయూలో చదువుకుని ఎందరో భిన్న రంగాల్లో సత్తా చాటారు. ఇక్కడ చదవనందుకు నేను ఎంతో బాధపడుతున్నా. ఏయూ స్థాపన వెనక ఎంతో మంది కష్టం, త్యాగం ఉంది. ఈ యూనివర్సిటీ అభివృద్ధి కోసం అనేక మంది దాతలు సాయం చేశారు. ఈ వర్సిటీ రాష్ట్రానికే కాదు.. దేశానికి కూడా గర్వకారణం' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. నేనూ కూడా ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థినే. విభిన్న ఆలోచనలున్న వారిని ఒక చోటికి తీసుకొచ్చే కేంద్రమే వర్సిటీ. ఇక్కడ చదువుకుని ఎందరో గొప్పవాళ్లు అయ్యారని దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. ఈ వేడుకల్లో దేశ ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, మంత్రి లోకేశ్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజముద్ర

**వీరంతా బిజెపిలో చేరినట్లుగా గుర్తించిన ఛైర్మన్**

**రాజ్యసభలో 113 కు చేరిన బిజెపి సంఖ్యాబలం**

న్యూఢిల్లీ,ఏప్రిల్27 : ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమవ్వడానికి రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాజ్యసభలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ విలీనంతో బీజేపీ సంఖ్యాబలం 113కి పెరిగింది. ఆప్ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆప్ నుంచి రాఘవ్ చద్దా, సాందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలివాల్ సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విలీనానికి రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం తెలపడంతో వారంతా బీజేపీ సభ్యులయ్యారు. విలీనం తర్వాత తమను బీజేపీ ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురూ రాజ్యసభ ఛైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. దానికి తాజాగా ఆమోదం లభించింది. కాగా, తమ పార్టీ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది. కేంద్ర సంస్థలను ఉపయోగించి తమ నాయకులను ఒత్తిడి చేసి బీజేపీలోకి చేర్చుకున్నారని ఆరోపించింది. ఈ అంశంపై చట్టపరమైన పోరాటం కూడా కొనసాగుతుందని తెలిపింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు ఇటీవల బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ విలీన ప్రక్రియను సోమవారం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలం ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువ అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ ఛైర్మెన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య ఛైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే.

## అలుపెరగని పోరాటంతో లక్ష్యసాధన

**తెలంగాణ కలను సాకారం చేసిన బిఆర్ఎస్**

**పార్టీ ఆవిర్భావం సందర్భంగా కెటిఆర్, హరీష్‌ల ట్వీట్లు**

హైదరాబాద్,ఏప్రిల్27 : తెలంగాణ రాజకీయ యవనికపై అలుపెరుగని పోరాట పటిమతో, స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన భారత రాష్ట్ర సమితి నేటితో 25 వసంతాలను పూర్తి చేసుకుని, 26వ ఏట అడుగుపెట్టింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని ఆ పార్టీ అగ్రనేతలు, మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని.. ఓ విప్లవమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ తన సందేశంలో బీఆర్ఎస్ ప్రస్థానాన్ని ఒక మహోజ్వల విప్లవంగా అభివర్ణించారు. నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండాగా, స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం నేటికి 25 వసంతాల మైలురాయిని అధిగమించిందని పేర్కొన్నారు. సిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకల సందర్భంగా కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్లకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ఓ రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది ఒక విప్లవమని, తెలంగాణ అస్తిత్వం కోసం మళ్లీ పునరంకితం కావాల్సిన సమయం వచ్చిందని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ, కేసీఆర్ నాయకత్వ ప్రాముఖ్యాన్ని హరీశ్‌రావు వివరించారు. నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసిన ధిక్కార వేదిక బీఆర్ఎస్ అని, ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దిందని కొనియాడారు.

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలి. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదు. సీఎం రేవంత్‌రెడ్డి మొదట్నుంచీ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

## ఏయూ వర్సిటీ అంటే వందేళ్ల చరిత్ర

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్ర తొలి కేబినెట్ మీటింగ్ ఏయూలోనే ఏర్పాటు చేసినట్లు మంత్రి లోకేశ్ గుర్తు చేసుకున్నారు. ఏయూ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం, కష్టం ఉందని అన్నారు. ఈ యూనివర్సిటీలో చిహ్నం నుంచి కోర్సులు వరకు అన్ని ప్రత్యేకమే అని చెప్పుకొచ్చారు. ఏయూ అనేక ర్యాంకులు సాధించి.. దేశంలో టాప్-3 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఉందన్నారు. అలాగే ప్రపంచంలో టాప్-100 యూనివర్సిటీల్లో నిలిచిందన్నారు. రాజకీయాల్లోనూ ఏయూ విద్యార్థులు రాణిస్తున్నారని మంత్రి చెప్పుకొచ్చారు. ప్రజలకు సేవ చేయాలని 2013 సంవత్సరంలో తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినట్లు గుర్తు చేసుకున్నారు. రిస్క్ లేనిదే విజయం లేదని.. విజయానికి ఓటమి తొలి మెట్టు అని విద్యార్థులకు మంత్రి లోకేశ్ సూచించారు. కాలం మారుతుందని, సాంకేతికత మారుతుందని కరిక్యులం కూడా మారాలన్నారు. ఈ సందర్భంగా విద్య శాఖలో ఖాళీలను రానున్న ఏడాది కాలంలోనే భర్తీ చేస్తామంటూ మంత్రి లోకేశ్ తీపి కబురు చెప్పారు. మంగళవారం నాడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసుకుంటున్నామని పేర్కొన్నారు. గూగుల్ రాకతో విశాఖ రూపురేఖలు మారిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఏయూ వందేళ్ల వేడుకల సందర్భంగా స్మారక నాణెం, స్టాంప్, కాఫీ టేబుల్ బుక్‌ను ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, సచిన్ టెండూల్కర్, కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా విడుదల చేశారు.

## బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

**29న రెండో విడత ఎన్నికలు**

**బిజెపి అధికారంలోకి వస్తున్న మోడీ**

**మళ్లీ సిఎం ప్రమాణానికి వస్తానంటూ వెల్లడి**

కోల్‌కతా,ఏప్రిల్27 : బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం ముగిసింది. 29న రెండోవిడత ఎన్నికలు జరగనున్నాయి. దీంతో 27న సాయంత్రం ప్రచారం ముగిసింది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. ఈ క్రమంలో ప్రధాని మోడీ ప్రచారం ముగిసంది. భాజపా అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో నేడు చివరి ర్యాలీలో పాల్గొన్నానని.. మళ్లీ బెంగాల్‌లో భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రానికి తిరిగి వస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామన్నారు. అదే ఉత్సాహంతో నేడు తాను వెళ్తున్నట్లు పేర్కొన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు ఇరువైపులా ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని అన్నారు. తనను ఆశీర్వదించడానికి వేలాదిమంది ప్రజలు వస్తారని ఊహించలేదని సంతోషం వ్యక్తంచేశారు. బెంగాల్‌లోని బారక్‌పుర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించి.. భాజపాలో చేరిన తర్వాత ఓ కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా చేశానని ప్రధాని వెల్లడించారు. ఎన్నికల బాధ్యతలు స్వీకరించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఓ కుటుంబం అంటూ ఏదీ లేదని.. దేశ ప్రజలే తన కుటుంబమని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని..ఈ రోడ్‌షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. వారు అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్నే టీఎంసీ నేతలు విడిచిపెట్టారని ప్రధాని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ పాలనలో మహిళలపై మునుపెన్నడూ లేని స్థాయిలో దాడులు జరుగుతున్నాయని, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## అమెరికా అధ్యక్షుడిపై కాల్పుల ఘటన

అలాంటి లక్షణాలున్న వ్యక్తిని ఏమాత్రం అంగీకరించను అని ఆ నోట్‌లో నిందితుడు రాసుకున్నాడు. అలాగే తాను ఎవరిని టార్గెట్ చేయాలను కున్నాడో ఒక జాబితాను సిద్ధం చేసుకున్నాడు. తన జోలికి రానంతవరకు అతిథులు, ఇతర సిబ్బందిని, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లపైనా కాల్పులు జరపనని పేర్కొన్నాడు. అలాగే హోటల్ భద్రత ఘోరంగా ఉందని, తాను భారీ రైఫిల్‌ను తెచ్చినా ఎవరూ గుర్తించేవారు కాదంటూ నిందితుడు వ్యాఖ్యా నించాడు. ఇక కాల్పుల ఘటన అనంతరం అధ్యక్షుడు మీడియాతో మాట్లాడుతూ.. నోట్‌లో ఉన్న ఆరోపణలను తోసిపుచ్చారు. నిందితుడు రాసుకున్నది మీ గురించే అని భావిస్తున్నారా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. అతడే దానిని రాసుకున్నాడు. కానీ నేను రేపిస్ట్‌ని కాను. ఏమాత్రం సంబంధం లేనివాటిని నాకు ముడిపెట్టారు. నేను నిర్దోషిని అంటూ తనను ప్రశ్నించిన రిపోర్టర్‌పై అసహనం వ్యక్తంచేశారు. ప్రస్తుతం నిందితుడు రాసుకున్న అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ట్రంప్ యంత్రాంగంలోని అధికారులను లక్ష్యంగా చేసుకోవాలని అతడు ప్రయత్నించినట్లు వెల్లడవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఇకపోతే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ఆయన, సతీమణి మెలనియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తుపాకులు, కత్తులతో వచ్చిన ఆగంతుకుడు 'శ్వేతసౌధం విలేకరుల సంఘం' విందు జరుగుతున్న హోటల్‌లోని బాల్‌రూంవైపు వెళ్తూ కాల్పులకు దిగడంతో ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. ట్రంప్‌ను రక్షించడానికి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆగమేఘాలపై స్పందించగా.. కాల్పుల చప్పుళ్లు వినగానే ప్రాణభయంతో పలువురు అతిథులు టేబుళ్ల కింద దాక్కోవాల్సి వచ్చింది. నిందితుడు కోల్ టొమాస్ అలెన్‌ను (31) అక్కడికక్కడే నిర్బంధంలో తీసుకుని సంకెళ్లు వేశారు. అతడి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఉలిక్కి పడేలా చేసింది. ఘటన తర్వాత కూడా విందు కొనసాగించాలని ట్రంప్ గట్టిగా భావించినా.. భద్రతాధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణం ఖాళీ చేయడమే మేలని సూచించి ఆయనను శ్వేతసౌధానికి తరలించారు. ట్రంప్‌పై దాడికి ప్రయత్నించడం రెండేళ్లలో ఇది మూడోసారి.

## త్యాగాల పునాదులపై ఏర్పడ్డదే బిఆర్ఎస్

కేసీఆర్25 ఏండ్ల క్రితం జలదృశ్యంలో గులాబీ జెండా ఎత్తిపట్టారని గుర్తు చేశారు.14 ఏండ్ల తన పోరాటంతో తెలంగాణ జాతిని ఐక్యం చేసి సబ్బండ వర్ణాలను ఏకతాటిపైకి తెచ్చి తెలంగాణ కలను సాకారం చేశారన్నాను. అడుగడుగునా పోరాటాలు చేస్తూ ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అని కేటీఆర్ అన్నారు. పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలబెట్టారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్, భాజపా పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి.. మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పార్టీ పునరంకితం అవుతుందని అన్నారు. సాధించిన తెలంగాణ కోసం అధికారం అప్పగిస్తే పదేండ్ల కాలంలో బాధ్యతగా పని చేసి అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. కానీ, రెండున్నర ఏండ్ల కాంగ్రెస్ పాలనలో అరాచక పాలన మొదలైందన్నారు. కాంగ్రెస పాలనకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల తరపున పోరాడుతున్నది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఏ బాధ్యత అప్పగించినా బీఆర్ఎస్ పార్టీ సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలకు స్వీయ రాజకీయ అస్తిత్వం ఉండాలని ప్రొ.జయశంకర్ అనేవారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్, బీజేపీ నుంచి రక్షించుకునేందుకు ఐక్యంగా పోరాడుదామన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చేసేదాకా దండుగా కదం తొక్కుదామని పిలుపునిచ్చారు. కేసీఆర్ దిశానిర్దేశర కోసం గులాబీ దండు ఎదురుచూస్తోందన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వారియర్స్, పార్టీ కార్యకర్తలకు, జర్నలిస్టులకు,కవులు, కళాకారులు, ఉద్యోగులు సమస్త ప్రజానికానికి వినమ్ర ధన్యవాదాలు తెలిపారు.

## బెంగాల్ ప్రచారం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది

బీజేపీ రాష్ట్రాభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రజల ముందు ఉంచానని, అయినప్పటికీ ఈ లేఖ ద్వారా తన మనోభావాలని రాష్ట్ర ప్రజలందరితోనూ పంచుకోవాలని అనుకుంటున్నానని చెప్పారు. బెంగాల్ సోదర, సోదరీమణుల్లారా అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో అసాధారణ శక్తిని తాను అనుభూతి పొందానని, తీవ్రమైన వేడి, వరుస ర్యాలీల్లో పాల్గొన్నప్పటికీ తనకెలాంటి అలసట రాలేదని చెప్పారు. 'ఈ ర్యాలీలు, రోడ్‌షోలు నాకొక యాత్రలాంటి అనుభూతినిచ్చింది. మా కాళి భక్తులతో కలిసి నేను ఎప్పుడు వెళ్లినా ఆ తల్లి నాలో రెట్టించిన శక్తిని నింపుతున్నట్టు అనిపిస్తుంది. 2024 జనవరిలో అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన జరిగిన 11 రోజులు ఉపవాసం చేశాను. అప్పటిలాగా బెంగాల్ ప్రచారంలో కూడా అలాంటి ఆధ్యాత్మిక అనుభూతే నాకు కలిగింది' అని మోదీ వెల్లడించారు. బెంగాల్‌లో పాల్గొన్న ర్యాలీలు, రోడ్‌షోలలో ప్రజల నుంచి హృదయాన్ని కదిలించే ఎన్నో మెసేజ్‌లు, ఫోటోలు తనకు అందాయని, వాటిని ఎప్పటికీ మరచిపోలేనని మోదీ తెలిపారు. ఎంత అర్ధరాత్రయిన వీలు చూసుకుని వాటిని చదవడంతో పాటు స్పందిస్తుంటానని చెప్పారు. యువకులు, మహిళలు, ఆడకూతుళ్లు, పెద్దలు సహా అన్ని వయస్సుల వారు చూపిస్తున్న ఆదరణ మరువలేనని, వారే తనకు అత్యంత విలువైన సంపద అని అభివర్ణించారు. బెంగాల్ సత్వర అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్న విషయం తాను గ్రహించానని, యువత ప్రగతిపథం వైపు దూసుకువెళ్లే అవకాశాల కోసం, ఆడకూతుళ్ల ఆకాశమే హద్దుగా అవకాశాలు అందిపుచ్చుకోవడం, భద్రత కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రజలంతా మార్పు కావాలనే ఏకైక సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని తెలిపారు. సురక్షిత బెంగాల్‌కు తాను బాధ్యత తీసుకుంటానని, సవాళ్లను అవకాశాలుగా మార్చేందుకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని చెప్పారు. 'రాష్ట్రంలో బీజేపే ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి ప్రజలంతా కలిసివస్తారనే నమ్మకం నాకుంది. మనమంతా కలిసి అభివృద్ధి చెందిన బెంగాల్‌ను నిర్మించుకుందాం' అంటూ ప్రధాని ఆ లేఖను ముగించారు.

## ఇరాన్ దాడుల నుంచి రక్షణకు

**యూఎఇకి ఇజ్రాయిల్ ఐరన్ డోమ్**

**అమెరికా పత్రిక సంచలన కథనం**

న్యూయార్క్,ఏప్రిల్ 27 : పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రగులుతున్న వేళ యూఏఈని ఇజ్రాయిల్ అనూహ్యంగా ఆదుకొంది. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను యూఏఈ తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో అడ్డుకొంది. కానీ, కొన్ని ఇరాన్ ఆయుధాలు కీలక మౌలిక వసతులపై దాడులు చేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మిత్రదేశాల సాయం కోరింది. దీంతో ఇజ్రాయెల్ ముందుకొచ్చి దానికి సాయం చేసినట్లు అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. ఇజ్రాయెల్ తన ఐరన్‌డోమ్ వ్యవస్థను యూఏఈకి పంపించడంతోపాటు.. దానిని ఆపరేట్ చేసి రాకెట్లు, డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ దళాలను కూడా అక్కడికి తరలించింది. ఇరాన్ దాడుల తీవ్రత పెరగడంతో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జయేద్ నుంచి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్‌కాల్ వెళ్లింది. ఆ తర్వాతే ఐరన్ డోమ్ వ్యవస్థను యూఏఈకి తరలించాలని ఇజ్రాయెల్ ప్రధాని నుంచి ఐడీఎఫ్ దళాలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో ఇరాన్ దాడులకు ప్రధాన మారిన అబుదాబికి ఊరట లభించింది. దీంతో డజన్లకొద్దీ ఇరాన్ క్షిపణులను యూఏఈ ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో అడ్డుకొంది.

## మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి

### సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు

### సమగ్ర దర్యాప్తునకు ఢిల్లీ పోలీసులకు ఆదేశం

న్యూఢిల్లీ,ఏప్రిల్27 : మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి చేసిన ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఘటనపై సంక్షిప్త విచారణ చేపట్టింది. కేసు రిజిస్టర్ చేసి సీనియర్ అధికారిణులతో దర్యాప్తు చేయించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఎస్పీ లేదా డీఎస్పీ ర్యాంకు అధికారిణులతో మాత్రమే దర్యాప్తు చేయించాలని స్పష్టం చేసింది. బాధితురాలి తరఫున అడ్వకేట్ స్నేహ కలిత బెంచ్ ముందు మాట్లాడుతూ.. 'ఓ మహిళా న్యాయవాది అతి దారుణంగా కత్తి దాడికి గురయ్యారు. అది కూడా భర్త ఆఫీస్‌లో ఆమె కత్తి దాడికి గురయ్యారు. ఆమె చికిత్స కోసం మూడు ఆస్పత్రుల దగ్గరకు వెళితే.. చికిత్స చేయడానికి ఆస్పత్రులు ఒప్పుకోలేదు' అని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. గాయపడిన బాధితురాలిని చేర్చుకునేందుకు నిరాకరించిన మూడు ఆస్పత్రుల విషయంపై కూడా దర్యాప్తునకు ఆదేశించింది. గాయపడ్డ లాయర్‌కు ఆర్థిక సాయం అందేలా చూడాలని అధికారులకు సూచించింది. తదుపరి విచారణ సమయంలో కేసు దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని తెలిపింది. కాగా, ఢిల్లీ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ మధు రాజ్‌పుత్ ఆదివారం భర్త చేతిలో కత్తి దాడికి గురయ్యారు. ఈ విషయంపై నిన్ననే చీఫ్ జస్టిస్ సూర్య కాంత్‌కు ఓ లేఖ అందింది. ఆ లేఖ అందిన వెంటనే ఆయన సుమోటో కేసు రిజిస్ట్రర్ చేయాలని ఆదేశించారు.

## రాములోరి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



శంకరపట్నం, ఎప్రిల్ 27(ది క్రైం న్యూస్):కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ముత్తారంలో సోమవారం జరిగిన శ్రీ సీతారామస్వామి కళ్యాణ మహోత్సవానికి టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలు సమర్పించి స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పిటిసి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ తదితరులు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఉన్నారు

## 2027 జనగణనకు తొలి అడుగు

### వివేకానంద నగర్‌లో సెల్ఫ్ ఎన్యూమరేషన్ పోస్టర్ విడుదల



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027 జనగణన కార్యక్రమంలో భాగంగా వివేకానంద నగర్‌లోని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ నివాసంలో సోమవారం సెల్ఫ్ ఎన్యూమరేషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి, తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ జనగణనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. తొలి విడత గణన ఇప్పటికే ప్రారంభమైందని, మే 10 వరకు ప్రజలు స్వచ్ఛందంగా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో గృహ, వసతి, ఆస్తులకు సంబంధించిన 33 ప్రశ్నలు ఉంటాయని, ఎలాంటి పత్రాలు అవసరం లేకుండా 15--20 నిమిషాల్లో పూర్తి చేయవచ్చని వివరించారు. దేశంలోనే ఇది తొలి పూర్తి స్థాయి డిజిటల్ జనగణన కావడం విశేషమన్నారు. మే 11 నుండి జూన్ 9 వరకు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జనగణన దేశంలోని ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేయడానికి కీలకమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన, సమాన వనరుల పంపిణీకి ఈ గణాంకాలు పునాదిగా నిలుస్తాయని చెప్పారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ఖచ్చితమైన సమాచారం అందించాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన

### తీవ్ర సంక్షోభంలో రాష్ట్ర వ్యవసాయ రంగం

### రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు అధ్వాన్నం

### పంట కొనుగోళ్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి

### ప్రజా సమస్యలపై ఇక నుంచి ఉధృతంగా పోరాటం

### మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,ఏప్రిల్27 : రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వీటిపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించామని తెలిపారు. ప్రతి ప్రజా సమస్యను ఐడెంటిఫై చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే కేసీఆర్ అధ్యక్షతన మరో సమావేశం ఉంటుందని వెల్లడించారు. ప్రజా సమస్యలపై ఇక నుంచి ఉధృతంగా పోరాడాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యకవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు చేశామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అన్నివర్గాలకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశామని పేర్కొన్నారు. అరాచక కాంగ్రెస్ పాలనకు సంబంధించి భేటీలో నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో సబ్బండ వర్గాలు, సకల జనులకు ధన్యవాదాలు చెబుతూ తీర్మానం చేశామని అన్నారు. సమావేశం సందర్భంగా కీలక విషయాలను చర్చించామని తెలిపారు. కేసీఆర్ పార్టీ ఏర్పాటుకు దారి తీసిన పరిస్థితులు వివరించారని పేర్కొన్నారు. రైతుబంధు తీసుకొచ్చి రైతులను ఆదుకోవడాన్ని ఐరాస ప్రశంసించిందని చెప్పారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని అన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సరిగ్గా జరగడం లేదని తెలిపారు. ఏ ఆంక్షలు లేకుండా మక్క, జొన్న పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట కొనుగోళ్లు సరైన రీతిలో చేపట్టకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. పంట కొనుగోళ్లు త్వరగా చేసేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడంపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ పార్లమెంటులో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించామని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో బీఆర్ఎస్ లేని లోటు స్పష్టంగా కనిపించిందని అన్నారు. తేజస్వి మాట్లాడిన సమయంలో సభలో ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా అతనితో క్షమాపణలు చెప్పించి ఉండేవాళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీల నిష్క్రియాపరత్వంపై సమావేశంలో నిరసన వ్యక్తమైందని చెప్పారు. బీజేపీ ఉద్దేశపూర్వకంగానే మహిళా బిల్లుకు అడ్డుపుల్ల వేసిందని కేటీఆర్ విమర్శించారు. మహిళా బిల్లుకు మద్దతుగా ఆనాడే బీఆర్ఎస్ తీర్మానాలు చేసి పంపిందని చెప్పారు. మహిళా రిజర్వేషన్లపై కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. సర్ పై కూడా కూలంకషంగా సమావేశంలో చర్చించామని కేటీఆర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో 95 లక్షలు, బిహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని పేర్కొన్నారు. త్వరలోనే తెలంగాణలో కూడా సర్ మొదలు కాబోతుందని వెల్లడించారు. సర్ విషయంలో కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్ దిశానిర్దేశర చేశారని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దొంగ ఓట్లు సృష్టించి గెలిచారని తెలిపారు. సర్ విషయంలో పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా ఉండాలని కేసీఆర్ సూచించారని చెప్పారు. బూత్ లెవల్ టు స్టేట్ లెవల్ క్రియాశీలకంగా పనిచేయాలని తీర్మానం చేశామని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపైనా సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర కమిటీ మినహా మిగతా అన్ని కమిటీలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కొత్త కమిటీలను తొందరలోనే చేస్తామని చెప్పారు. స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో మెంబర్‌షిప్ కార్యక్రమం చేపడతామని అన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు పద్ధతుల్లో సభ్యత్వ నమోదు చేస్తామని చెప్పారు. రాశి కంటే.. వాసి ముఖ్యమని కేటీఆర్ అన్నారు. క్వాలిటేటివ్‌గా మెంబర్‌షిప్ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకత్వం తెలంగాణకు రక్షణ కవచంలా నిలబడాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ముఖ్య కార్యకర్తలకు, నాయకులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి త్వరలోనే షెడ్యూల్ వెల్లడిస్తామని అన్నారు.కవిత 'టీఆర్ఎస్' పేరుతో పెట్టిన కొత్త పార్టీపై కేటీఆర్ స్పందించారు. చాలా పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయని ఎద్దేవా చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువ అని పేర్కొన్నారు. కొత్త పార్టీని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ గురించి చాలా మంది మాట్లాడుతున్నారని.. వాటిని కూడా పట్టించుకోనక్కర్లేదని చెప్పారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోలు పక్రియ

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రతిమా సింగ్

### హవేలీ ఘన్‌పూర్ మండల కేంద్రం ఆకస్మిక తనిఖీ

మెదక్,ఏప్రిల్27 : మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు పక్రియ వేగవంతంగా జరగాలని.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వాహకులను, వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలోని ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న టార్ఫాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరగాలని ఇప్పటి వరకు 880. మంది రైతుల నుండి 4270. 040 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని 38 మంది రైతులకు -42 లక్షల రూపాయలు ఖాతాలో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలు పక్రియ సాఫిగా సాగేందుకు?మూడు దశల్లో టోకెన్ పద్ధతి ని పెట్టడం జరిగిందని.. దీనిని ఆయా శాఖల అధికారులు తూ. చ తప్పకుండ పాటించాలని తద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా?తేమ శాతం వచ్చిన ధాన్యం వేగం గా కొనుగోలు అవ్వడం జరుగుతుందన్నారు. కొనుగోలు పక్రియ పూర్తి కాగానే వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం బస్తాలను తరలించాలన్నారు. రవాణా పరంగా కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా తగు లారీలను నిర్వాహకులు కేంద్రాలకు సరైన సమయం లో వచ్చేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. వేసవి ఎండల నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చిన టోకెన్ల ఆధారంగా కేంద్రాలకు రావాలన్నారు. అలాగే కేంద్రాలలో తాగు నీరు, నీడ తదితర మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, తహసీల్దార్‌సింధు రేణుక ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి
- రెయిన్ బో స్కూల్ బాలల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు



గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని లోని రెయిన్ బో స్కూల్ లో సోమవారం"బాలల భద్రత- మాదకద్రవ్యాలకు నో చెప్పండి" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి యువతే దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత మాదకద్రవ్యాలు వంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి కారణంగా ఎదురయ్యే ఆరోగ్య మరియు సామాజిక సమస్యలపై విద్యార్థులకు వివరించారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై చట్టపరమైన చర్యల గురించి అవగాహన కల్పించారు. బాలల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని,వేధింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆపద సమయంలో డయల్ 100 లేదా స్థానిక పోలీసుల సహాయం ఎలా పొందాలో కూడా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## శంశిగుడా మహిళకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2 లక్షల సహాయం



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంశిగుడాకు చెందిన కోయ పుష్పకు అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2,00,000 ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మంజూరి పత్రాన్ని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు గొప్ప ఆధారంగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స పొందలేని నిరుపేదలకు ఈ నిధి ఎంతో ఉపశమనం కలిగిస్తోందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సీఎం సహాయ నిధి ఆపన్నహస్తంలా తోడ్పడుతోందని తెలిపారు. ఈ సహాయం అందించినందుకు గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక.





కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 27(ది క్రైమ్ న్యూస్)భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ విభాగమైన తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (రి.నెం. జి.445) మరింత బలోపేతమైంది. సోమవారం నాడు వివిధ కార్మిక సంఘాలకు చెందిన సుమారు 25 మంది కార్మికులు సీనియర్ నాయకులు జి. రాందాస్ ఆధ్వర్యంలో యూనియన్‌లో చేరారు.ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయిజిల్లా అధ్యక్షులు గొంటి సురేంద్ర ప్రసాద్,జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా ఫకీర్ దాస్ వీరి నియామకాన్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నే శశి కుమార్ అధికారికంగా ప్రకటించారు. నూతన కార్యవర్గం కార్మికుల హక్కుల కోసం, విద్యుత్ రంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్. రాష్ట్ర సంఘటన మంత్రి జె. రామ్మోహన్ జీ, ఎన్.పి.డి.సి.ఎల్. కంపెనీ అధ్యక్షులు శ్రీ రావుల రమణ రెడ్డి, బి.ఎం.ఎస్. రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్, జిల్లా అధ్యక్షులు శ్రవణ్, ప్రధాన కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ వందలాది మంది కార్మికులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## గోమాతకు గౌరవం కల్పించాలి: గోశాల ప్రతినిధుల వినతి



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : గోమాతకు ప్రత్యేక గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలని, గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని గోశాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గో సమ్మాన్ ఆహ్వాన అభియాన్ పిలుపు మేరకు బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి గోశాల ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డికి గోమాతలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం, సిద్దిపేట జిల్లా పీఠాధిపతులు విశ్వబ్రహ్మ శ్రీ వీరధర్మజ స్వామి, గోశాల ప్రధాన కార్యదర్శి బోనకుర్తి విఠల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గోవధ నిషేధ చట్టం ఉన్నప్పటికీ అమలు సరిగా జరగడం లేదన్నారు. ప్రభుత్వం నిర్బంధంగా ఈ చట్టాన్ని అమలు చేయాలని, గోమాతకు ప్రత్యేక గౌరవాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. దేశమంతటా గో సేవ సమానంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో గో ఆధారిత పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులను గో ఆధారిత వ్యవసాయం వైపు ప్రోత్సహించి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. అలాగే ప్రతి రాష్ట్రంలో గోశాలలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, పశుగ్రాసం పెంపు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి గ్రామంలో గోశాలలు ఏర్పాటు చేయాలని, గోవుల అక్రమ రవాణా, హత్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోశాలలకు స్థానిక పరిశ్రమల నుంచి సిఎస్ఆర్ నిధులు అందేలా చూడాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగ సమితి సభ్యులు, గోశాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## కవిత ప్రశ్నలకు సమాశానం చెప్పాలి

### ఇంట్లో ఫ్రస్టేషన్‌ను బయట చూపిస్తే ఎలా

### కెటిర్‌పై మండిపడ్డ ఎమ్మెల్యే మందల సామేల్

హైదరాబాద్,ఏప్రిల్27 : మీ సోదరి కవిత ఎందుకు పొలిటికల్ పార్టీ పెట్టారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ డిమాండ్ చేశారు. కేటీఆర్‌కు రేగు కంపలాగ కవిత తగిలారని వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే సామేల్.. సీఎం రేవంత్‌పై కేటీఆర్, కవిత చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. మీ ఇంట్లో ఫ్రస్టేషన్‌ను బయట ఎందుకు చూపిస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం చేశారని కవిత అడుగుతున్నారని.. ముందు ఆమెకు సమాధానం చెప్పాలని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. లిక్కర్ కేసులో తన ప్రమేయం లేదని కవిత అంటున్నారని.. నిజంగానే ప్రమేయం లేకుంటే తీహార్ జైలుకు ఎందుకు వెళ్లారో చెప్పాలని కవితను ప్రశ్నించారు. అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లిని కాదని కవితకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తు చేసిన సామేల్.. దీని వెనక ఉన్న రహస్యమేంటో చెప్పాలని కవితను ప్రశ్నించారు. ఇంటి పోరుతో ఇబ్బంది పడుతున్న మీరు.. మంది జోలికి ఎందుకు పోతున్నారంటూ సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరూ గుర్తుపట్టట్లేదని కేటీఆర్ అంటున్నారని.. కేటీఆర్‌ను గుర్తుపట్టే స్థలాలు తనకు బాగా తెలుసునని సామేల్ వ్యాఖ్యానించారు. గుంట నక్కలు, తోడేళ్ళు అందరూ మీ వద్దనే ఉన్నారంటూ కేటీఆర్‌పై ఎమ్మెల్యే ÷ర్ అయ్యారు. మరో పదేళ్లు కాంగ్రెస్ పార్టీని కదిలించే దమ్ము ఎవరికి లేదని ఎమ్మెల్యే సామేల్ స్పష్టం చేశారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# యువత విద్యతోనే తమ లక్ష్యం సాధించాలి

## ● ఎస్ ఐ ఓ జాతీయ అధ్యక్షులు అబ్దుల్ హఫీజ్



పెద్దపల్లి ప్రతినిధి : నేటి యువత విద్యతోనే తమ లక్ష్యాన్ని సాధించి దేశానికి, కని పెంచిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్ ఐ ఓ జాతీయ అధ్యక్షులు అబ్దుల్ హఫీజ్ అన్నారు. ఆదివారం రోజున స్థానిక ఎంబి గార్డెన్ లో ఎస్ ఐ ఓ జిల్లాస్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ ఎస్ అమీనుల్ హసన్, ఎస్ ఐ ఓ తెలంగాణ అధ్యక్షులు ఫరాజ్ అహ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలు మరియు సమాజంలో వారి బాధ్యతలు, ప్రస్తుత కాలంలో యువత అనేక సవాళ్లను ఎదుర్కొంటోందనీ ,విద్యలో వెనుకబడటం, జీవితంలో స్పష్టమైన లక్ష్యం లేకపోవడం, నిరుద్యోగ భయం, సోషల్ మీడియా దుర్వినియోగం, మరియు నైతిక విలువల నుండి దూరమవడం, ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన మార్గదర్శకత్వం లేక చాలామంది యువత దారి తప్పుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కాన్ఫరెన్స్ ద్వారా యువతకు దిశానిర్దేశం చేస్తూ, విద్య, లక్ష్య సాధన, నైతిక విలువలు మరియు సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించి వారిలో మనోధైర్యాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో జమాఅత్-ఎ-ఇస్లామీ హింద్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై జావీద్ ,యూనిట్ అధ్యక్షుడు ఎం.ఏ. మొయిాద్ ,పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ముజైఫ్ ఉద్దీన్,మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, జావీద్ హుసైనీ,మున్సిపల్ వైస్ చైర్పర్సన్ నయ్యర్ అలీ,ఖవీఔా అధ్యక్షుడు అస్లం పర్వేజ్, కౌన్సిలర్లు అశ్రఫ్ షరీఫ్ , ఎం.ఏ. నదీమ్ , సల్మాన్ , ఆదిల్ ఖాన్ ,షంషేర్ బేగ్ , ఎం పి జె జిల్లా, యూనిట్ అధ్యక్షులు సయ్యద్ మతీన్ ఉద్దీన్ , మిస్బాహ్ ఉద్దీన్ ,ఎం.ఏ. హదీ , లైఖ్ ఉల్లా ఖాస్మీ ,ముఫ్తీ ఇమ్తియాజ్ ఖాన్ , సయ్యద్ ముజాహిద్ రజా, ఖాజీ ఇస్మాయిల్,అహ్మద్ పాషా , మొహమ్మద్ రజ్జాక్ , మొహమ్మద్ జమీర్ ఉద్దీన్ , రౌఫ్ అజిజీ , ఎం.ఏ. కలీమ్ , యూసుఫ్ బేగ్ , యాకూబ్ రజా, మొహమ్మద్ రఫీక్,కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సజ్జాద్ , సయ్యద్ హబీబ్ ఉల్లా మస్రత్ , ఎం.ఏ. ముస్తాక్ అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల -కంపెనీలా విధానాలపై డీలర్ల నిరసన ...

జగిత్యాల, ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల డీలర్లు “ఎరువుల దుకాణాల బందు” పేరుతో ఒక్కరోజు బంధ్ నిర్వహిస్తూ కంపెనీల విధానాలపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఎరువుల కంపెనీలు అమలు చేస్తున్న “లింక్డ్ ప్రొడక్ట్” విధానం (అంటే ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులు బలవంతంగా కొనాల్సిన నిబంధన) రైతులు మరియు డీలర్లకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలర్ల ప్రకారం, ఎరువులు సరఫరా సమయంలో అనవసరమైన ఉత్పత్తులను జతచేయడం మాత్రమే కాకుండా, రవాణా ఖర్చులు (తీఘఅంజూశీతీ ఎఘ్షుతీస్త్రవం) కూడా డీలర్ల పై మోపటం వల్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. ఈ రవాణా ఖర్చులను డీలర్లపై మోపకుండా, కంపెనీలు భరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, కొన్ని యూరియా సరఫరా చేసే కంపెనీలు డిపాజిట్ పేరుతో రూ.15 లక్షలకుపైగా డీలర్ల నుంచి వసూలు చేస్తున్నాయని, ఆ మొత్తానికి ఎలాంటి వడ్డీ (ఱత్వతీవర్) ఇవ్వకపోవడం అన్యాయమని డీలర్లు ఆరోపించారు. ఈ విధానం వల్ల ప్రైవేట్ డీలర్లు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు అవసరం లేని వస్తువులు కొనాల్సి రావడం, అలాగే పెరుగుతున్న రవాణా ఖర్చులు మరియు భారీ డిపాజిట్ భారం కలిపి వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, పారదర్శక సరఫరా విధానం అమలు చేయాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు. ఎరువులు స్వతంత్రంగా అందుబాటులో ఉండేలా చేయాలని, కంపెనీలు బలవంతపు షరతులు, అధిక రవాణా ఛార్జీలు, డిపాజిట్ విధానం వంటి అంశాలను పునఃసమీక్షించాలని కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో ఎరువుల దుకాణాలు మూతపడడంతో రైతులకు తాత్కాలికంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఈ బంధ్ వ్యవసాయ రంగంపై ప్రభావం చూపవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఎరువుల డీలర్ల ఈ ఒక్కరోజు బంధ్ వ్యవసాయ రంగంలో పెరుగుతున్న అసంతృప్తికి సంకేతంగా మారింది. ప్రభుత్వం, కంపెనీలు త్వరగా స్పందించి డీలర్ల సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# ప్రజావాణి అర్జీదారులకు ఉచిత మజ్జిగ పంపిణీ

## ● మిషన్ వాత్సల్య స్టాల్ ద్వారా బాలల సంక్షేమంపై అవగాహన పెంచాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష





పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు, డీసీపీ రాంరెడ్డితో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుండి తమ సమస్యల విన్నపం కోసం కలెక్టరేట్‌కు వచ్చే సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఉచిత మజ్జిగ పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అంతకంటే ముందు, కలెక్టరేట్ ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన “మిషన్ వాత్సల్య - బాలల పరిరక్షణ సేవలు” స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. బాలల హక్కుల రక్షణ, అనాథ పిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా స్పాన్సర్‌షిప్ (ఆర్థిక సహాయం), పిల్లల దత్తత వంటి అంశాలపై అర్హులకు సరైన సమాచారం చేరవేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ జి.కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

# పటాన్చెరులో జెండా ఆవిష్కరణ



పటాన్చెరు, ఏప్రిల్ 27: పటాన్చెరు డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పటాన్చెరు మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తొంట అంజయ్య, గడిల శ్రీకాంత్ గౌడ్, గూడెం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకలో మాట్లాడిన మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజల హక్కుల కోసం పుట్టిన ఉద్యమమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను ఆయన గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన నాయకత్వాన్ని స్మరించుకుంటూ, ఉద్యమ సమయంలో జరిగిన సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ నాగరాజ్ యాదవ్, బండ్లగూడ అధ్యక్షుడు భరత్ కుమార్, నర్ర బిక్షపతి, పృథ్వీరాజ్, కల్వగడ్డ రాజ్ కుమార్, పరమేష్ యాదవ్, మహిళా కార్యకర్తలు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# సంఘటిత సమరశీల పోరాటాలను ఉధృతం చేయాలి: బుర్రి ప్రసాద్



మానకొండూర్, ఏప్రిల్27 : ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా 13వ మహాసభల ముగింపు సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ......420 హామీలతో అధికారంలోకి వచ్చిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను విస్మరిస్తూ వ్యవసాయ కూలీలను మోసం చేస్తున్నాయన్నారు. వ్యవసాయ కూలీలకు ఇచ్చిన ఏడాదికి 12వేలు, ప్రతి మహిళకు నెలకు 2500, 4వేల ఫెన్షన్ హామీల ఊసే ఎత్తకపోగా వాళ్ళ ఉపాధిని సైతం దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నాయన్నారు. నిరుపేదలకు ఇండ్లిస్తామన్న ప్రభుత్వాలు పేదల గుడిసెలను కూలగొట్టి రాక్షసత్వాన్ని రుజువు చేసుకుంటుండగా పేదల కడుపు కొట్టి భూస్వాముల బొజ్జలు నింపుతున్న నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో రాష్ట్రంలో దేశంలో సంఘటిత సమరశీల పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నూతన కమిటీకి ఎన్నుకలు నిర్వహించి జిల్లా అధ్యక్షుడిగా రాయికంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి సంపత్, కోశాధికారిగా మాతంగి శంకర్, ఉపాధ్యక్షులుగా కనకం దుర్గాప్రసాద్, కవంపల్లి అజయ్, సహాయ కార్యదర్శిగా వడ్ల రాజును ఏకగ్రీవంగా ఎన్నికోవడంతో పాటు మరో 10 మందిని సభ్యులుగా ఎన్నికుని మొత్తం 17మందితో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు.గత మూడేళ్లుగా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం చేసిన పోరాటాలను సమీక్షించి భవిష్యత్తు పోరాటాల ప్రణాళికగా రూపోందిన మహాసభకు అనుకూలంగా రాష్ట్ర కమిటీ ఇచ్చే ప్రతి పోరాటాన్ని జిల్లాల్లో జయప్రదం చేసే విధంగా నూతన నాయకత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందని బుర్రి ప్రసాద్ సూచించారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## - ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన ఉప్పు కేతమ్మ 59/ఈ సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమి గత 50 సంవత్సరాల నుండి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని ప్రభుత్వ భూమిని తమ పేరు మీద పట్టా చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ ముత్తారం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన దిండు. స్వప్న ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణం నల్ల పోచమ్మ వాడకి చెందిన రజియా బేగం డబల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజేపి రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుక



మానకొండూర్, ఏప్రిల్27 :కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచంద్రరావు జన్మదిన వేడుకను పార్టీ మండలాధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కేక్ కోసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీగా పనిచేసిన అపార అనుభవం,అన్ని రంగాల్లో పట్టున్న గొప్ప నాయకుడిగా ఆదర్శప్రాయుడైన రామచందర్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో రాష్ట్ర ప్రజలకు సేవచేసే భాగ్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని బిజేపి జిల్లా ఉపాధ్యక్షుడు రంగు బాస్కరాచారి ఆకాంక్షించారు. నాయకులు రాపాక ప్రవీణ్, మియాపురం లక్ష్మణచారి, మార్కొండ రమేష్ పటేల్, శీలం కుమార్, మాదాసు కుమార్, తిక్క దేవేందర్, వైద వైదిక రావు, మిరాల శ్రీనివాస్, అజయ్, రాజు, అఖిల్ తదితరులు వేడుకలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలి

## - పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సుల్తానాబాద్ ఏప్రిల్ 27: రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా మరియు వేగవంతంగా జరగాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు తీసుకువచ్చే ధాన్యం తప్పనిసరిగా ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, తూకం, తేమ కొలతలను పకడ్బందీగా నిర్వహించి రైతులకు వెంటనే రశీదులు అందజేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ఓపీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి. కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియలో జాప్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలి. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ (సివిల్ సప్లైస్) శ్రీకాంత్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అలుపెరుగని పోరాటంతోనే స్వరాష్ట్ర స్వప్నం సాకారం: పాకాల మహిపాల్ రెడ్డి

బెజ్జంకి, ఏప్రిల్27: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం బిఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు ఘనంగా



నిర్వహించారు. మండలకేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి జెండా ఎగురవేసిన అనంతరం మాట్లాడుతూ.....2001 జలదృశ్యంతో పురుడుపోసుకుని 25ఏండ్ల ప్రయాణంలో అనేక ఒడిదుడుకులను తట్టుకుంటూ 14 ఏండ్ల అలుపెరుగని పోరాటంతో 60 ఏండ్ల స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి కెసిఆర్ సరికొత్త చరిత్రను లిఖించారని కొనియాడారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించి అద్భుతాలు సృష్టిస్తూ అన్ని రంగాల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలను బట్టబయలు చేస్తూ ప్రజాదరణను చూరగొని తొలిముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, హరీష్ రావు నేతృత్వంలో బిఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రావటం ఖాయమని మహిపాల్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.పార్టీ తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు వేడుకలో పాల్గొన్నారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

● పార్టీ జెండాను ఎగురవేసిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ రోజు కేవలం క్యాలెండర్‌లోని ఒక తేదీ మాత్రమే కాదు, కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, వారి పోరాటాలు మరియు త్యాగాల ఫలితంగా ఏర్పడిన చారిత్రాత్మక రోజు" అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేక మంది అమరవీరుల త్యాగాలు కీలక పాత్ర పోషించాయని ఆయన గుర్తుచేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ గారి పిలుపు మేరకు వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి 'జై తెలంగాణ' అంటూ గర్జించిన సందర్భాలను ఆయన స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచిందని తెలిపారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఎండిన నేలలు సస్యశ్యామలం కావడం ప్రజలకు ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. అలాగే పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో వెలుగులు నింపాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ, తెలంగాణ ప్రజలందరికీ 26వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, నాయకులు పెంచాల శ్రీదర్, పూదరి చంద్రశేఖర్, రామగిరి చంద్రమౌళి, బెక్కం ప్రశాంత్ ,కాశీపాక వాసు, ఫహీం, దాసరి శ్రీనివాస్, పల్లె మధు, ముఖీం , రఫియొద్దిన్, జుబేర్, స్వామి వివేక్ పటేల్, జక్కుల శ్రీకాంత్, ఆతిక్, నాగులమల్యాల శ్రవణ్, నుగిళ్ళ వీరేశం, మనోజ్, అజార్, ముభాషీర్, మునీర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని పేరా 3 సవరణ కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దళిత క్రైస్తవుల విన్నపం




**కరీంనగర్ టౌన్, ఏప్రిల్27:** కరీంనగర్ జిల్లాకు చెందిన దళిత క్రైస్తవ ప్రతినిధులు ఈరోజు కోర్ట్ చౌరస్తా నుండి కలెక్టర్ కార్యాలయం వరకి శాంతి యుతంగా ముందుకు సాగుదాం న్యాయం సాధిద్దాం మన హక్కులను కాపాడుకుందాం అను నినాదం తో కరీంనగర్ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవ శాంతి ర్యాలీ గా వచ్చి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 10 ఆగస్టు 1950న జారీ చేయబడిన రాష్ట్రపతి (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులోని పేరా 3 కారణంగా తాము ఎదుర్కొంటున్న వివక్షను ఈ సందర్భంగా వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రంలోని రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన 1950 ఉత్తర్వులోని పేరా 3 ప్రకారం, క్రైస్తవ మతాన్ని స్వీకరించిన దళితులను షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) జాబితా నుండి మినహాయించడం వల్ల, వారు దశాబ్దాలుగా రాజ్యాంగపరమైన ఫలాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు కల్పించబడిన మత స్వేచ్ఛను ఈ ఉత్తర్వు అడ్డుకుంటోందని, కేవలం మతం మారినందున రిజర్వేషన్లు మరియు ఇతర హక్కులను నిరాకరించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా కల్పించేలా సదరు ఉత్తర్వును సవరించాలని లేదా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రాన్ని పరిశీలించి, తదుపరి చర్యల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదించాలని దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఈ కార్యక్రమం లో పాస్టర్ జాషువా కేడిపిఫ్ ప్రెసిడెంట్, పాస్టర్ ఎలీషా, సీడీఫ్ ప్రెసిడెంట్, పాస్టర్ నతనియేలు కేసీపీఫ్ సెక్రటరీ,పాస్టర్ మోసెస్ బాబూరావు సంఘవిశ్వాసులు, తాళ్లపల్లి జాషువా కేడీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఎలిషా సిడిపిఎఫ్ అధ్యక్షులు, తిమోతి కేపీఏ అధ్యక్షులు, రెవరెండ్ జాన్ సిఎస్ఐ చర్చి ఫాస్ట్ రేట్ చైర్మన్ రెవరెండ్ పాల్ కొమ్ముల సిఎస్ఐ చర్చ్ కె ఎన్ ఆర్ రెవరెండ్ సంతోష్ కుమార్ కేడిపిఫ్ అధ్యక్షులు రెవరెండ్ నతానియల్, కేసీపీఫ్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ మోజెస్ పాస్టర్ గంగరాజు, ప్రొఫెసర్, నతనియేలు హైదరాబాద్, తదితరులు పాల్గొన్నారు.

# సీజ్ చేసినా పనులు ఆగవా..? అక్రమ నిర్మాణంపై అధికారులపై అనుమానాలు..

● రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణం.. ఐదు అంతస్తుల భవనం ● స్టిల్ట్ పార్కింగ్‌ను షాపులుగా మార్పు.. సెల్లార్ కూడా అక్రమమేనన్న ఆరోపణలు ● సీజ్ చేసినా పనులు యథావిధిగా కొనసాగింపు, అధికారులపై ప్రశ్నలు ● నర్సాపూర్ హైవే వద్ద ప్లాట్ నెం.6లో నిర్మాణం.. స్థానికుల ఆగ్రహం






**దుండిగల్, ఏప్రిల్ 27, :** స్థానికంగా అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల ద్వారా సీజ్ చేసిన భవనంలో కూడా పనులు ఆగకపోవడం చర్చనీయాంశంగా మారింది. "సీజ్ అంటే నాటకమేనా?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... దుండిగల్ మండలం గండిమైసమ్మ ప్రాంతంలో నర్సాపూర్ హైవే పక్కన, ఉజ్వల బార్ సమీపంలో ఉన్న ప్లాట్ నెం.6, సర్వే నెం.179, 180 & 212లో ఈ అక్రమ నిర్మాణం జరుగుతున్నట్లు సమాచారం. సంబంధిత భవనానికి కేవలం రెసిడెన్షియల్ (వసతి) అనుమతులు మాత్రమే ఉన్నప్పటికీ, యజమాని వాటిని ఉల్లంఘిస్తూ పూర్తిగా కమర్షియల్ నిర్మాణంగా మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, అనుమతులకు విరుద్ధంగా ఏకంగా ఐదు అంతస్తులు నిర్మించడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. అంతేకాక, స్టిల్ట్‌ను కేవలం పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించాల్సి ఉండగా, యజమాని/బిల్డర్ దానిని కూడా కమర్షియల్ ఉపయోగానికి మార్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా సెల్లార్‌ను కూడా అక్రమంగా నిర్మించి వినియోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల అధికారులు ఈ అక్రమ నిర్మాణాన్ని గుర్తించి సీజ్ చేసినప్పటికీ, అక్కడ నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజ్ చేసిన భవనంలో పనులు ఎలా జరుగుతున్నాయన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ నేపథ్యంలో, అధికారుల నిర్లక్ష్యమా లేదా కొంతమంది ప్రభావవంతుల జోక్యమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, భూస్థాయిలో అమలు సరిగా లేకపోవడం వల్ల అక్రమ నిర్మాణాలు ఆగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుని, సీజ్ చేసిన భవనంలో జరుగుతున్న పనులను తక్షణమే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు తగ్గుతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

# చింతల్‌లో ఆన్లైన్ డ్రగ్స్ ముఠా అరెస్ట్

- ఇంస్టాగ్రామ్ వేదికగా డ్రగ్స్ విక్రయాలకు స్వస్తి
- 63 లక్షల విలువైన మితాన్ఫిటమైన్ స్వాధీనం



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 04,** కుత్బుల్లాపూర్ ఎస్ఓటి జీడిమెట్ల పోలీసులు చింతల్‌లో ఇంస్టాగ్రామ్ వేదికగా నడుపుతున్న డ్రగ్స్ దందాను పోలీసులు నిర్వీర్యం చేశారు, మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం తాజాగా చింతల్ లో 63 లక్షల విలువైన ఖరీదైన మేథంఫేటమిన్ అనే మత్తు పదార్థాలను కుత్బుల్లాపూర్ ఎస్ఓటి మరియు జీడిమెట్ల పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి పట్టుకున్నారు, ఈ ప్రక్రియలో వేముల సాయి కుమార్ స్థానికులకు సరఫరా చేస్తున్నట్లు నిర్ధారించుకొని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు, తిరుమల అరవింద్ అనే యువకుడు మత్తు పదార్థాలను వినియోగిస్తున్నట్లు నిర్దారణ చేసుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు, ఈ ఖరీదైన మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు కుత్బుల్లాపూర్ స్థానికుడు పూజిత్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్టు డీసీపీ తెలిపారు.

## బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి చంద్రశేఖర్

**జగిత్యాల, ప్రతినిధి :** జిల్లా కు చెందిన ఓరుగంటి చంద్రశేఖర్ బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ నియామక పత్రాన్ని జారీ చేశారు. ఓరుగంటి చంద్రశేఖర్ విద్యార్థి దశలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకు గా, ఏబీవీపీ జగిత్యాల పట్టణ కార్యదర్శిగా, బాగ్ ప్రముఖ వివిధ బాధ్యతలను నిర్వహించారు. యువ మోర్చా లో వివిధ బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించబడ్డారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కి ఎంపీ అరవింద్ లకు దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కి చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో అందరిని కలుపుకొని భారతీయ జనతా పార్టీని బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# సంకల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు పెద్దబుద్ధుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో చలివెంద్రాలు ఏర్పాటు

- ప్రారంభించిన ట్రాఫిక్ సి.ఐ మధుసూదన్, బీజేపీ నాయకులు రాజిరెడ్డి





**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 07:** వేసవికాలంలో ప్రయాణికులకు త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతో సంకల్ప్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పెద్దబుద్ధుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో కొంపల్లి శివాలయం కమాన్ ఎదురుగా మరియు జూడియో పక్కన చలివెంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాల ప్రారంభానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ మరియు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి గార్లు పాల్గొని, వేసవి ఉష్ణోగ్రతను మరియు ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సామాజిక సేవ చేస్తున్న సంకల్ప్ ఫౌండేషన్ సభ్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంకల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్ గౌడ్, ఉప్పరి మహేందర్ మరియు స్థానిక నాయకులు సరిత రావు, శివాజీ రాజు, జీవన్ రెడ్డి, సువర్ణ, అశోక్, చక్రధర్, నరసింహ, మాధురి, దుర్గా, మురళి కృష్ణ, ఆనంద్ సాగర్, లక్ష్మణ్, తిరుపతి, శివాజీ, రవి, అశోక్, అశ్విన్, మల్లికార్జున్, ప్రసాద్, సతీష్, అయోధ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు....

# ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యంపై సీపీ ప్రత్యేక శ్రద్ధ

- ఎండల దృష్ట్యా చలువ కళ్లద్దాల పంపిణీ - విధుల్లో ఆరోగ్యం ముఖ్యం: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని క్రైమ్ :** విధుల్లో ఆరోగ్యం చాలా ముఖ్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చలువ కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఎండాకాలంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది ఎండ వేడిమి నుండి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరి పనితీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్లపై విధులు నిర్వహించే సమయంలో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చలువ కళ్లద్దాలను అందజేస్తున్నామని తెలిపారు. విధుల పరంగా గానీ, వ్యక్తిగతంగా గానీ ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎండ వేడిమి ప్రభావం నుండి రక్షణ పొందేందుకు తరచుగా ఎక్కువగా నీళ్లు తాగాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ఆరఐ రమేష్, ఎస్.ఐ హరిశేఖర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి కనీస ఇంగిత జ్ఞానం ఉందా.....?

- బకాయిలపై ముఖ్యమంత్రిని గెరావ్ కార్యక్రమాలు తప్పవు: పొన్నం అనీల్ కుమార్ గౌడ్





**కరీంనగర్, ఎప్రిల్27:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, బిఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ పొన్నం అనీల్ కుమార్ గౌడ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం అనీల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ..... విద్యాశాఖకు మంత్రి లేక రాష్ట్రంలో విద్యార్థులకు అన్ని అవస్తలే కనిపిస్తున్నాయని, ఫీజు రీయింబర్స్మెంట్లు ఇచ్చిన దాఖలాలు లేకపోగా బకాయిలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేటికీ ఒక్క రివ్యూ నిర్వహించలేదని అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతుందంటూ ప్రశ్నించారు. విద్యార్థుల వెన్నుముక విరిచేలా ప్రవర్తిస్తున్న ప్రభుత్వానికి కనీస ఇంగిత జ్ఞానం ఉందా అంటూ విమర్శించారు. రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయమయ్యే విధంగా సహకరించాలని, లేదంటే రానున్న రోజుల్లో అన్ని జిల్లాలోని కలెక్టర్ కార్యాలయాలతో పాటు ముఖ్యమంత్రి ఇంటిని ముఖ్యమంత్రిని గెరావ్ చేసే కార్యక్రమలను బిఆర్ఎస్ విద్యార్థి విభాగం చేపడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిఆర్ఎస్వీ నాయకులు ధ్యావ మధుసూదన్ రెడ్డి, చుక్క శ్రీనివాస్, బొంకురి మోహన్, నాయిని అన్వేష్, అరె రవి గౌడ్, చందు, పరుశరాములు , శ్రీకాంత్, విక్రమ్, ఓంకార్, తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

- తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత



**సుల్తానాబాద్, ఏప్రిల్ 27:** ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని , దేశంలో సంపూర్ణ గోహత్య నిరోధక చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం సుల్తానాబాద్ మండల తహసిల్దార్ బషీరుద్దీన్ కి 'గో సమ్మాన్ అభియాన్' ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీ ధర్మశాస్త్ర గోశాల అధ్యక్షులు బండారి సూర్య మాట్లాడుతూ, భారతీయ సంస్కృతికి సనాతన ధర్మానికి గోవు మూలస్తంభమని కొనియాడారు. గోవును కేవలం జంతువుగా కాకుండా జాతీయ చిహ్నంగా గుర్తించి, 'జాతీయ జంతువు' హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. గోవుల సంరక్షణ , సేవా కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేకంగా ఒక 'గో సేవా మంత్రిత్వ శాఖ'ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. తహసిల్దార్ ద్వారా తమ వినతిని జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి, గవర్నర్, భారత ప్రధాని రాష్ట్రపతి కి పంపాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కొమరవెల్లి శ్రీధర్, తుమ్మ రాజ్ కుమార్, సాదుల కరుణాకర్, తిరుపతి రెడ్డి, అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి తెలుగుదిన పత్రిక

# తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక మన గులాబీ జెండా.!

● అలుపెరగని పోరాటంతో రాష్ట్రాన్ని తెచ్చిన జెండా..మన గులాబీ జండా...! ● అభివృద్ధిలో తెలంగాణను అగ్రగామిగా నిలిపిన జెండా...మన గులాబీ జండా..!





**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 27:** 60 సంవత్సరాల కల సాకారానికై పుట్టింది మన జండా, పోరాట పటిమతో ఎందరో త్యాగల స్ఫూర్తి తో తెలంగాణ రాష్ట్రం సాధించిన ఈ గులాబీ జండా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ మరియు ఇందిరమ్మ కాలనీ, లహరి గ్రీన్ పార్క్, సింహపురి కాలనీల్లో జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని భౌరంపేట్ దీ=ూ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ సార్ పాత్ర అపారమైనది మరియు చారిత్రాత్మకమైనది. ఆయన 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించి, తెలంగాణ కోసం ఉద్యమాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ముందుకు తెచ్చి, ప్రాంతీయ అసమానతలు, అన్యాయాలపై గళమెత్తారు. గల్లి నుండి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని విస్తరించి, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. 2009లో ఆయన చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమానికి కీలక మలుపు తిప్పింది. ఆ దీక్షతో దేశవ్యాప్తంగా తెలంగాణ అంశం ప్రధాన చర్చగా మారింది. దీర్ఘకాల పోరాటం ఫలితంగా 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఇది కేసీఆర్ సార్ పట్టుదల, ధైర్యం, నాయకత్వానికి నిదర్శనం అని అన్నారు... కేవలం రాష్ట్ర సాధనతో ఆగకుండా, రాష్ట్ర అభివృద్ధికి ఆయన కృషి అపారమైనదని. రైతు సంక్షేమం, పేదల కోసం సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ ప్రజల కోసం అహర్నిశలు కష్టపడి, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన గొప్ప నాయకుడు కేసీఆర్ సార్ అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి , భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వాం. సురేందర్ రెడ్డి, పోలీస్ గోవింద్ రెడ్డి, ధర్మారెడ్డి, మురళీ యాదవ్ , విష్ణువర్ధన్ రెడ్డి మరియు నాయకులు మహిపాల్ రెడ్డి, చింత వెంకట్ , బల్వంత్ రెడ్డి, బైండ్ల గోపాల్, మధుసూదన్ రెడ్డి, కామేశ్వరరావు, అక్రమ్, వంశీ, తిరుపతి, భూషణ్, దిలీప్, ఎల్లయ్య, బాబీ, ప్రభాకర్ మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కన్నులపండువగా 'శ్రీ భగీరథ జయంతి' వేడుకలు







**హైదరాబాద్:ఏప్రిల్ 23 :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు అధ్వర్యంలో బీజేఎ శ్రీ రాష్ట్ర కార్యాలయంలో నేడు శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ జాతీయ ఓబీసీ అధ్యక్షులు కె.లక్ష్మణ్, చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర రెడ్డి, మాజీ ఎం.పి బూర నర్సయ్య గౌడ్, బిజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుళ్ళ దేవేందర్ గౌడ్, విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ సకల జీవకోటికి ప్రాణాధారమైన గంగను దివి నుండి భువికి తెచ్చిన మహర్షి శ్రీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ, సగర వంశవృక్షం చరిత్ర, భగీరథ గంగావతరణం మరియు సగరుల సామాజిక ఆర్థిక పరిస్థితుల గురించి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సగర కులాన్ని బీసీడీ నుండి బీసీఏ చేర్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భగీరథ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ఉప్పరి రమేష్, ఎగ్గని నర్సింలు, బి.బి.ఆర్ వేణు, పెద్దబుద్ధుల సతీష్, మల్లికార్జున్, బాలకృష్ణ, ఉప్పరి మహేందర్ సాగర్, సగర సంఘం నాయకులు శేఖర్ సగర, హరికిషన్ సగర, శ్రీరాములు సగర, సగర కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఇంటి పండుగలా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు జరిగాయి: చల్లా హరిశంకర్




**కరీంనగర్, ఎప్రిల్27:** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని చింతకుంటలో గల బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం జెండా ఆవిష్కరణతో ఘనంగా నిర్వహించారు. అనంతరం బిఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చల్లా హరిశంకర్ మాట్లాడుతూ..... టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 25ఏండ్లు పూర్తి చేసుకుని 26వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఇంటి పండుగలా ప్రజలు సంబరాలు జరుపుకున్నారన్నారు. తెలంగాణ సాదనకై ఉద్యమ పార్టీ ఉండాలన్న సంకల్పంతో నాడు కెసిఆర్ బిఆర్ఎస్ ను ఏర్పాటు చేసి 14 ఏండ్ల పోరాటంతో రాష్ట్రాన్ని సాదించి ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారన్నారు.ఉద్యమ నాయకుడే పరిపాలకుడిగా పదేండ్లలో కోటి ఎకరాలకు నీరందించడమే కాక నీళ్ళు,నిధులు, నియామకాలను తెచ్చి తెలంగాణను దేశంలోనే గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దింది కేసిఆరేనని కొనియాడారు.నేడు ప్రతిపతిపక్షంలో ఉన్నా రెండున్నరేండ్లు ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్న బిఆర్ఎస్ ను గుండెల్లో పెట్టుకుని ప్రజలు మళ్ళీ కోరుకుంటున్నారని హర్షం వ్యక్తం చేస్తూ ప్రజలందరికీ బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.బిఆర్ఎస్ కార్పొరేటర్లు, గుగ్గిళ్ళ జయశ్రీ, నలువాల పుష్పలత,అలీ,గడ్డి ప్రదీప్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, నియోజకవర్గ యువత ప్రధాన కార్యదర్శి గంగాధర చందు,మైనార్టీ విభాగం పట్టణాధ్యక్షుడు మీర్ సౌకత్ అలీ, బిఆర్ఎస్వి నగర ఆధ్యక్షుడు బొంకూరి మోహన్, పార్టీ మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు డివిజన్ ఇన్చార్జులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకలాపాలకు టెక్నాలజీ తోడ్పాటు

## - 4జీ ఫోన్ల పంపిణీ: చైర్మన్ చింతల చంద్రారెడ్డి




**నల్లగొండ జిల్లా ప్రతినిధి:ఏప్రిల్ 28:** నల్లగొండ జిల్లా హాలియా మున్సిపాలిటీ పరిధిలో అంగన్వాడీ టీచర్లకు 4జీ స్మార్ట్ ఫోన్లను మున్సిపల్ చైర్పర్సన్ చింతల చంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం అనుముల ప్రాజెక్ట్ పరిధిలోని హాలియా మున్సిపల్ కౌన్సిల్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్పర్సన్ గౌని రాజా రమేష్ , మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు ప్రతి లబ్ధిదారుని ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయడం, 0 నుండి 6 సంవత్సరాల పిల్లల బరువులు నమోదు చేయడం, హాజరు నమోదు చేయడం, ఫేస్ క్యాప్చర్ ద్వారా ధృవీకరణ చేసి ఆహార పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ చంద్రారెడ్డి గారు మాట్లాడుతూ, అందజేసిన ఫోన్లను అంగన్వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కే. రమాదేవి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# 25 ఏళ్ల ఉద్యమ గాధకు గూడెంలో ఘన వేడుక

- ఒక నాయకుడు.. ఒక పోరాటం.. ఒక రాష్ట్రం - 14 ఏళ్ల పోరాటం.. 25 ఏళ్ల పార్టీ.. తెలంగాణ విజయ గాధ - అసాధ్యం నుంచి సుసాధ్యం చేసిన కథ - ఉద్యమం నుంచి అధికారానికి ఎన్నో మలుపులు - నినాదాల నుంచి నిజాల దాకా.. - ఎండిన గడ్డ నుంచి అన్నపూర్ణ వరకు - ఉద్యమ కెరటానికి 25 వసంతాలు



**బ్యూరో, (తారజ్యోతి):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గూడెం గ్రామంలో ఘనంగా గులాబీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. 2001 ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా స్థాపించబడిన తెలంగాణ రాష్ట్ర సమితి ( ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి) 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలు జరిగాయి. గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమ రోజులను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు( కెసిఆర్) నాయకత్వాన్ని గుర్తు చేసుకున్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ధీరుడుగా 14 ఏళ్ల దీక్షతో తెలంగాణ స్వప్నాన్ని సహకారం చేసిన మహా నాయకుడిగా కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తీవ్ర సాగునీటి కొరత, ఉపాధి సమస్యలు వాటి కష్టాలను ఎదుర్కొన్న ప్రజల జీవన పరిస్థితులను గుర్తు చేస్తూ, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అభివృద్ధి దిశగా జరిగిన మార్పులను గుర్తు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించడం, రైతులకు రాయితీలు, రైతుబంధు, రైతు భీమా వంటి పథకాలు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలను ప్రస్తావించారు. ఇవన్నీ తెలంగాణను వ్యవసాయ రంగంలో దేశంలోనే ముందంజలో నిలబెట్టాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ రేగుల సంపత్, నల్ల మల్లారెడ్డి, కొలకాని సతీష్, వీరముష్టి సుదర్శన్, బుడిగె సమ్మయ్య, వీర ముష్టి రమేష్ ,నంద సంపత్, తిప్పారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడేషన్ ఇవ్వాలి

## - తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్ లు అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడేషన్ లు అందించాలని, మండలాల్లో ఉన్న జర్నలిస్టులకు ఎస్ ఎస్ సి అర్హతతో లేదా సీనియార్టీతో అక్రిడేషన్ అందించాలని అన్నారు.చిన్న పత్రికలకు పబ్లికేషన్స్ సెంటర్లలో మాత్రమే కాకుండా ఎంప్యానల్ ఉన్న చిన్నపత్రికలకు జిల్లా స్థాయిలో జీవో ప్రకారం రెండు కార్డులు అందించాలన్నారు. మండలాల్లో ఎలాంటి వెరిఫికేషన్ లేకుండా వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ ఫణి సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షులు మారం తిరుపతి రెడ్డి, బోయిని వినోద్, సహాయ కార్యదర్శి షాబీర్ పాషా, కార్యవర్గ సభ్యులు పిట్టల పరమేష్, జి సాగర్, నూక రామదాసు, గోపికృష్ణ, సుమన్, సంతోష్, రవి, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల మున్సిపాలిటీలో రాజీనామా సవాళ్లతో రాజకీయ ఉద్రిక్తత

## - రాజీనామా పత్రంతో సిద్ధమైన కౌన్సిలర్ నరేందర్ రెడ్డి



**పటాన్చెరు(గుమ్మడి దల), ఏప్రిల్ 27:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధం తీవ్రంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన 13వ వార్డు కౌన్సిలర్ నరేందర్ రెడ్డి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి సవాల్ విసిరారు. దీనికి ప్రతిస్పందనగా కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ సంధ్య గోవర్ధన్ రెడ్డి కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్య సవాల్ను స్వీకరించిన 13వ వార్డు కౌన్సిలర్ నరేందర్ రెడ్డి, తన రాజీనామా పత్రంతో మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనతో గుమ్మడిదలలో రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారాయి.

# భూంపల్లి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**మంథని ఏప్రిల్ 26 :** కమాన్పూర్ మండలానికి చెందిన భూంపల్లి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం సాయంత్రం పరామర్శించారు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయిన మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొంపల్లి రాజయ్య,బొంపల్లి మొండయ్య తల్లి శాంతమ్మకు ఇటీవల కుడి చేతికి శస్త్రచికిత్స జరగడంతో స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా నాయకులు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు కుటుంబ సభ్యులను ఆత్మీయంగా ఓదార్చి, ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్, మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, మత్స్యశాఖ చైర్మన్ గడప కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ మరియు ఏఎంసీ డైరెక్టర్ దాసరి గట్టయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు నగునూరి నరసయ్య గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు మరియు ఆదివరాహస్వామి దేవస్థానం డైరెక్టర్ కొంతం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బోనాల సత్యం, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి అప్సర్, ఇనగంటి ప్రభాకర్ రావు, ఇనగంటి మురళీ మనోహర్ రావు, మాజీ మైనార్టీ అధ్యక్షుడు ఎండి జావేద్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బోనగాని వీరయ్య గౌడ్, భూంపల్లి మల్లేష్, మాజీ వార్డు సభ్యుడు అనవేని లక్ష్మీరాజం, వెంకన్న గౌడ్, సీనియర్ నాయకులు హైమత్, మల్యాల చిన్న తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు లేక గ్రామపంచాయతీ కార్మిక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు

**జగిత్యాల, ప్రతినిధి :** జగిత్యాల జిల్లా సోమవారం చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాలలో పారిశుద్ధ కార్మికులకు జీతాలు లేకపోవడం వల్ల మండలంలోని గ్రామ పంచాయతీలలో కార్మిక సిబ్బంది. తీవ్ర ఇబ్బందులు. ఎదుర్కొంటున్నారని మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు తెలిపారు. 18 నెలల క్రితం సాధారణ నిధుల నుండి జారీ చేసిన చెక్కులు చెల్లనందున, జీతాలు చెల్లించాలని ఆయన గౌరవనీయ సర్పంచులను అభ్యర్థించారు. గ్రామ పంచాయతీలు వసూలు చేసే ఇంటి పన్ను నుంచి చెల్లించే జీతాలను కూడా రద్దు చేయడం విషాదకరమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, గత డిసెంబర్ నుంచి సిబ్బంది జీతాలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కాకుండా సాధారణ నిధుల నుంచి. చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్ జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. జీతాలు ఆదాయాన్ని మించిపోతున్నందున, సాధారణ నిధుల నుండి జీతాలు చెల్లించడం సాధ్యం కాదని, ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం చెల్లింపులు చేయకపోతే చిన్న గ్రామ పంచాయతీలు, పారిశుధ్య కార్మికుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాత్రి, శనివారంపేట ఎంపీటీసీ అనసూయ, సర్పంచ్ ఐలయ్య, ఎంపీటీసీ సభ్యులు పిల్లా మల్లేశం, మళ్ల మల్లయ్య పాల్గొన్నారు..

# కాటారం మండలంలో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కాటారం, ఏప్రిల్ 27 (తారా జ్యోతి):** భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంథని మాజీ శాసనసభ సభ్యులు పుట్ట మధు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు జోడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాటారం బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ అంటే తెగింపు, తెగువ, త్యాగం. ఈ మూడు కలిస్తేనే బంగారు తెలంగాణ, గోదావరి గలగలలు, కాకతీయుల వైభవం, బతుకమ్మ పూల సౌరభం ఇదే మన తెలంగాణ వైభవం,60 ఏళ్ల పోరాటం, లక్షల మంది త్యాగం, కోట్ల మంది కల జూన్ 2, 2014 న సాకారమైంది. నీళ్లు మనవి, నిధులు మనవి, నియామకాలు మనవి అని నినదించిన గడ్డ తెలంగాణ, అమ్మ భాష యాస, అమ్మ చేతి వంట, అమ్మమ్మ చెప్పిన కథ అన్నీ తెలంగాణ తీపి గుర్తులే. కేసీఆర్ నాయకత్వం, ప్రొ. జయశంకర్ ఆలోచన, కాళోజీ కలం ఈ మూడే తెలంగాణకు ప్రాణం. పోతన భాగవతం పుట్టిన నేల, కొమురం భీం నినదించిన నేల, బతుకమ్మ ఆడిన నేల మన తెలంగాణ నేల, తెలంగాణ యువత లేస్తే తుఫాన్. తెలంగాణ ప్రజలు నిలబడితే చరిత్ర ఈ రోజు కోసం ఒక్క మాట ప్రతి ఉదయం తెలంగాణ అభివృద్ధి కోసం ఒక అడుగు వేద్దాం. అదే అమరులకు మనమిచ్చే నిజమైన నివాళి అని పలువురు నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం డివిజన్ బిఆర్ఎస్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పంతకాని సడవలి, సర్పంచ్ వూర వెంకటేశ్వరరావు, కొండ గొర్ల వెంకటస్వామి, గాలి సడవలి, జాడి శ్రీశైలం, ఉప్పు సంతోష్, మానేం రాజబాబు, ఎండి మున్వర్, చీర్ల తిరుపతి రెడ్డి, ఉరగొండ లింగయ్య, చీమల వంశీ,కొండపర్తి రవి, సకినాల ప్రశాంత్, బాసాని రవి, ఉప సర్పంచ్ దానం సమ్మయ్య, వంగల రాజేంద్ర చారి, ఆయిలి రాజబాబు, బొడ్డు రాజాబాబు, చల్ల శేఖర్, దుర్గారావు, కాటారపు రాజమౌళి, రత్న రమేష్, చందా శ్రీనివాస్, రాజయ్య, లక్మయ్య, అనుముల రమేష్, పైడాకుల మహేందర్, జమీర్ ఖాన్, ఇప్పలపల్లి దేవేందర్, గంట సమ్మయ్య, శ్రీరాముల రజనీకాంత్, రామిల్ల అంజి, పెనుగొండ రాజేందర్, తదితరులు ఉన్నారు.





# గిన్నిస్ రికార్డులో హాలియా కరాటే విద్యార్థుల ప్రతిభ మెరుపులు





**నల్గొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(:** నల్లగొండ జిల్లా హాలియా పట్టణానికి చెందిన కరాటే విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై తమ ప్రతిభను చాటుతూ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించారు. ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన లార్జెస్ట్ కరాటే డిస్ప్లే ప్రదర్శనలో సత్య స్పోర్ట్స్ కరాటే-దూ ఀ ఫిట్నెస్ అకాడమీ ఆఫ్ ఇండియా విద్యార్థులు పాల్గొని ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఈ విజయానికి మార్గదర్శకుడైన కోచ్ తంగేళ్ల సత్యనారాయణ రాజు (బ్లాక్ బెల్ట్ 6వ డాన్), నాలుగు సార్లు గిన్నిస్ రికార్డు హోల్డర్‌గా గుర్తింపు పొందారు. అలాగే ఇన్స్ట్రక్టర్ గుంటోజు హరికుమార్ (బ్లాక్ బెల్ట్ 2వ డాన్) కూడా విశేషంగా సహకరించారు. ఈ రికార్డులో భాగమైన విద్యార్థుల్లో బ్రౌన్ బెల్ట్ తంగేళ్ల వర్షిత్ రాజు, బోలిగొర్ల కృతిక్ యాదవ్, అలాగే బ్లూ బెల్ట్ కేటగిరీలో జి. యోగీశ్వర్, ఏ. ప్రణవి, టీ. రుషిక్, ఎన్. హాసిని, కే. కార్తీక, జీ. రిక్షిత, సి. హెచ్. దీపాలి, ఎం. సాయి యశ్వంత్, జి. కార్తికేయ, వి. సహస్ర, షేక్ మెహరున్నిసా, పి. నాగచైతన్య తదితరులు అర్హత సాధించారు. విద్యార్థుల ఈ విజయాన్ని ఇంటర్నేషనల్ జేఆర్ టైక్వాండో కరాటే అకాడమీకి చెందిన జయంత్ రెడ్డి, విజన్ కరాటే మాస్టర్ అకాడమీకి చెందిన విటల్ పటేల్ అభినందించారు. ఈ సందర్భంగా సత్య స్పోర్ట్స్ కరాటే-దూ ఀ ఫిట్నెస్ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు తంగేళ్ల సత్యనారాయణ రాజు మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, క్రమశిక్షణ వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని తెలిపారు.

# గోమాతను రాజ్యమాతగా స్వీకరించాలి

◆ గో సేవ కోసం కొత్తచట్టం చేయాలి ◆ అక్రమ రవాణాలో పాల్గొన్న నేరస్తులకు జీవిత ఖైదు శిక్ష విధించాలి ◆ గోవుల కోసం పంచగవ్య ఆసుపత్రులను ఏర్పాటు చేయాలి ◆ గోరక్షణ, కోసం కాటారం తహసీల్దార్ కు వినతిపత్రం ◆ విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు కొట్టే శంకరయ్య

**కాటారం, ఏప్రిల్ 27 (తారా జ్యోతి):** భారతదేశవ్యాప్తంగా గోమాత గౌరవ దినోత్సవం సందర్భంగా గోమాతను రాజ్యమాతగా చేయాలని భారతదేశంలో గోవధ నిషేధించాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా సోమవారం కాటారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ నాగరాజు కి విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు కొట్టే శంకరయ్య వినతిపత్రం అందజేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్ మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తాసిల్దార్ ద్వారా అభ్యర్థించారు. ఆవు జాతిమాత జాతీయ దేవత జాతీయ ఆరాధన జాతీయ వారసత్వం లేదా జాతీయ ఫౌండేషన్ అనే గౌరవనీయ హోదాను గోమాత కల్పించాలని గో సేవ కోసం చట్టం చేయాలని భారతదేశంలో గోవర్ధన పూర్తిగా నిర్మూలించాలని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భారతదేశంలో ప్రతి రాష్ట్రంలో తగిన అటవీ భూమి లేదా మేత భూమిలో కనీసం ఒక గోసంరక్షణ కేంద్రాన్ని తెరవాలని ప్రతి గ్రామపంచాయతీలో నిరుపేద రైతుకు సూది ఆవుల కోసం నందిషాల ఏర్పాటు చేయాలి, గుహతులకు పాల్పడే వారికి మరియు ఆవుల అక్రమ రవాణాలో పాల్గొన్న నేరస్తులకు జీవిత ఖైదు వంటి శిక్ష విధించే నిబంధన ఉండాలి, జిల్లా స్థాయిలో ప్రత్యేక పంచగవ్య ఆసుపత్రులను ఏర్పాటు చేయాలి హైవేలపై ఆవు ప్రమాదాలను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలి గాయపడిన పశువులకు తక్షణ చికిత్స మరియు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని గో సేవ గోరక్షణ మరియు గో గౌరవ కోసం అన్ని తహసీల్దారుల కు మెమోరం సమర్పించారు. ఈ విషయమై ప్రభుత్వం నుండి సానుకూలంగా ప్రకటన వెలువడినట్లయితే జులై 10న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతూ అన్ని జిల్లా కలెక్టర్లకు ధన్యవాదాలు కార్యక్రమం తెలియజేస్తామని. ఏదైనా కారణం చేత నిర్దేశించిన తేదీ నాటికి ఫలితం రాకపోతే 2026 అక్టోబర్ 27వ తేదీ మంగళవారం అన్ని జిల్లాలు మరియు తాసిల్దార్ కార్యాలయం సాధువులు అందరితో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కామెడీ శ్రీనివాస్ రెడ్డి, గో రక్షక ప్రచారక్ అందే భాస్కరాచారి మరియు వెన్నపురెడ్డి లక్ష్మణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రైతు గడ్డివాము, టేకు కలప పూర్తిగా దగ్ధం

**కాటారం, ఏప్రిల్ 27 (తారా జ్యోతి):** గడ్డివాము దగ్ధమైన ఘటన కాటారం మండలంలో చోటుచేసుకుంది. కాటారం గ్రామంలోని గంట వాడకు చెందిన గంట సమ్మయ్య దొడ్డిలో పశువుల కోసం గడ్డిని నిల్వచేశాడు. సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివాములకు మంటలు అంటుకున్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న కాటారం సర్పంచ్ పంతకాని సడవలి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది.ఈ గడ్డివాముకు ఆనుకొని ఉన్న టేకు కలప పూర్తిగా దగ్ధమైంది. గడ్డితో పాట సుమారు 1,50,000 విలువచేసే ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు గంట సమ్మయ్య వాపోయారు, కాటారం సర్పంచ్ పంతకాని సడవలి బాధిత కుటుంబాన్ని అధైర్య పడవద్దు వారికి అండగా ఉంటానని ధైర్యం కల్పించారు.



# హాలియాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై అవగాహన సమావేశం

**- ప్లాస్టిక్ నిషేధానికి కఠిన చర్యలు**





**నల్గొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28:** హాలియా పురపాలక సంఘంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల అసోసియేషన్ అధ్యక్షులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యాపారస్తులకు పలు కీలక సూచనలు చేశారు. షాపుల యజమానులు తడి మరియు పొడి చెత్తను వేరువేరుగా రెండు డబ్బాల్లో నిల్వ చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అలాగే హాలియాను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ఈనెల 30వ తేదీ వరకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని, మే1వ తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వస్తుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే తెలంగాణ మున్సిపాలిటీ చట్టం-2019 మరియు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ ప్రకారం రూ.5000 వరకు జరిమానా విధించడంతో పాటు షాప్ లైసెన్స్ రద్దు చేయబడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు,సలహాదారులు,వ్యాపార సంస్థల అసోసియేషన్ అధ్యక్షులు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ శశికుమార్, పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్నితగ్గించి, స్వచ్ఛమైన హాలియా నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అలాగే స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26లో భాగంగా సిటిజన్ ఫీడ్‌బ్యాక్ అందించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# పోలీస్ స్టేషన్ను సందర్శించిన నాగరాజు.... ఉన్నఫలంగా అంతం



**గన్నేరువరం, ఎప్రిల్27:** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లోకి సోమవారం నాగుపాము ప్రవేశించింది. ఎస్ఐ నరేందర్ రెడ్డి తన గదిలో కూర్చుని ఫిర్యాదు దారులతో మాట్లాడుతుండగా వెనుక వైపు ఉన్న కిటికీ నుండి నాగుపాము ప్రవేశించి ఎస్ఐ పైకీ ఎక్కెందుకు యత్నించింది. ఎదురుగా ఉన్న వ్యక్తి పాము అంటూ అరవడంతో ఎస్ఐ చాకచక్యంగా బల్లపైనుండి ముందుకు దూకి తృటిలో ప్రమాదం నుండి తప్పించుకున్నారు. ఆగమైన నాగుపాము బల్లకిందికి దూరి దాక్కోగా ఆందోళనకు గురైన పోలీస్ సిబ్బంది పాములవట్టే కళ్ళెంపోచయ్యను పిలిపించి నాగుపామును అంత మొందించారు. దీంతో స్టేషన్ సిబ్బంది, ఫిర్యాదు దారులంతా పాము ఆందళన నుండి విముక్తి పొందారు.

# స్వచ్ఛందంగా ఫెర్టిలైజర్ షాపు బంద్ విజయవంతం

**- బంద్ సహకరించి విజయవంతం చేసిన రైతులకు ఫెర్టిలైజర్ వ్యాపార వర్గాలకు ధన్యవాదాలు - కాటారం ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు కవ్వాల చంద్రశేఖర్**



**కాటారం, ఏప్రిల్ 27 (తారా జ్యోతి):** జాతీయ, తెలంగాణరాష్ట్ర అగ్రో ఇన్ ఫుట్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యాపారంలో తీవ్రమైన వివిధ సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియపరిచే విధానంలో రాష్ట్రవ్యాప్త బంద్ కార్యక్రమంలో భాగంగా సోమవారం భూపాలపల్లి జిల్లాలోని కాటారం మండల వ్యాప్తంగా బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధ్యక్షుడు కవ్వాల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. శాంతియుతంగా బంద్ సహకరించి విజయవంతం చేసిన రైతులకు వ్యాపార వర్గాలకు కాటారం ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కవ్వాల చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

# అరుదైన రీతిలో అవుటైన రఘువంశీ



క్రికెట్ మైదానంలో బ్యాటర్లు క్లీన్ బౌల్డ్ అవ్వడం లేదా క్యాచ్ ఇచ్చి అవుట్ అవ్వడం మనం ఎప్పుడూ చూస్తుంటాం. కానీ ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్ అంగ్ క్రిష్ రఘువంశీ ఎవరూ ఊహించని విధంగా అవుటై అందరినీ ఆశ్చర్యపరిచాడు. క్రికెట్ లోనే అత్యంత అరుదైన అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' రూపంలో అతను పెవిలియన్ చేరాడు. ఐపీఎల్ సుదీర్ఘ చరిత్రలో ఇలా అవుటైన నాలుగో ప్లేయర్‌గా రఘువంశీ నిలిచాడు. విశేషం ఏంటంటే ఇలా అవుటైన నలుగురూ భారతీయులే కావడం గమనార్హం. కేకేఆర్ ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో ప్రిన్స్ యాదవ్ వేసిన ఆఖరి బంతిని రఘువంశీ మిడ్–ఆన్ వైపు నెట్టి సింగిల్ కోసం పరుగెత్తాడు. అయితే నాన్–స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న కామరూన్ గ్రీన్ అతన్ని వెనక్కి వెళ్ళమని వారించాడు. దీంతో రఘువంశీ మళ్ళీ తన క్రీజులోకి రావడానికి వెనక్కి తిరిగాడు. సరిగ్గా అదే సమయంలో మహమ్మద్ షమీ విసిరిన త్రో నేరుగా స్టంప్స్ వైపు వస్తోంది. రఘువంశీ క్రీజులోకి డైవ్ చేసే క్రమంలో పిచ్ మీద ఉన్న 'డేంజర్ జోన్' లోకి రావడమే కాకుండా, షమీ విసిరిన బంతికి అడ్డంగా వచ్చాడు. ఆ బంతి నేరుగా రఘువంశీ శరీరానికి తగిలింది. షమీ అండ్ టీమ్ అప్పీల్ చేయడంతో థర్డ్ అంపైర్ రోహిత్ పండిట్ వీడియోను పరిశీలించి రఘువంశీని అవుట్‌గా ప్రకటించాడు. ఈ నిర్ణయంతో 9 పరుగుల వద్దే అతను వెనుదిరగాల్సి వచ్చింది. డగౌట్ వద్ద కేకేఆర్ కోచ్ అభిషేక్ నాయర్ అంపైర్లతో వాదించగా, రఘువంశీ అసహనంతో తన హెల్మెట్‌ను విసిరేసి నిరాశ వ్యక్తం చేశాడు. ఐసీసీ రూల్స్ ప్రకారం.. వికెట్ల మధ్య పరుగెత్తే సమయంలో ఒక బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా తన దిశను మార్చుకుని, ఫీల్డర్ వేసే త్రో స్టంప్స్ కు తగలకుండా అడ్డుపడితే దాన్ని 'అబ్స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' గా పరిగణిస్తారు. ఇక్కడ బంతి స్టంప్స్ కు తగిలే అవకాశం ఉందా లేదా అనేది ముఖ్యం కాదు, బ్యాటర్ కావాలనే తన రన్నింగ్ పాత్ మార్చుకున్నాడని అంపైర్ భావిస్తే అవుట్ ఇవ్వొచ్చు. పిచ్ మధ్యలో ఉండే సున్నితమైన ప్రాంతాన్ని బ్యాటర్ క్రాస్ చేసినా ఈ నిబంధన వర్తిస్తుంది.ఐపీఎల్ చరిత్రలో ఈ అరుదైన అవుట్ కు బలైన మొదటి ఆటగాడు యూసుఫ్ పఠాన్. 2013లో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పఠాన్ బంతిని తొక్కేస్తూ పరుగెత్తడంతో అంపైర్లు అవుట్ ఇచ్చారు. ఆ తర్వాత 2019 సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడిన అమిత్ మిశ్రా, బంతి విసిరే సమయంలో తన రన్నింగ్ రూట్ మార్చి ఈ రకంగా అవుటయ్యాడు. ఇక మూడవ ప్లేయర్‌గా టీమ్ ఇండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నిలిచాడు. 2024 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ విసిరిన త్రోకు అడ్డంగా రావడంతో జడేజాను అంపైర్లు అవుట్‌గా ప్రకటించారు. తాజాగా రఘువంశీ కూడా ఈ జాబితాలో చేరడంతో ఐపీఎల్ లో ఈ రూల్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఫీల్డింగ్ చేసే జట్టు అప్పీల్ చేసినప్పుడు మాత్రమే అంపైర్లు దీనిపై స్పందిస్తారు. కేకేఆర్ కేవలం 27 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో రఘువంశీ ఇలా అవుట్ అవ్వడం ఆ జట్టును కోలుకోలేని దెబ్బ తీసింది. యువ ప్లేయర్లు ఇలాంటి రూల్స్ పట్ల మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





## రింకు సింపుల్ మ్యాన్..

కోల్?కతా నైట్?రైడర్స్ స్టార్ బ్యాటర్ రింకు సింగ్ చాలా రోజుల తర్వాత కీలక ఇన్నింగ్స్?తో అదరగొట్టాడు. తాజాగా ఎకానా స్టేడియం వేదికగా లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో జరిగిన మ్యాచ్?లో అద్భుతమైన బ్యాటింగ్, ఫీల్డింగ్?తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. చివరి బంతి దాకా క్రీజులో ఉండి, జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించాడు. దీంతో అతడికి మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే మ్యాచ్ అనంతరం రింకు సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ? అవార్డ్ ప్రజెంటేషన్ సమయంలో 'నువ్వు జట్టు కష్టాల్లో ఉన్న ప్రతీసారి ఆదుకుంటావు కాదా. అందుకే నీ పేరును అపద్బాంధవుడు  రింకు అని మార్చమంటారా?' అని అడిగారు. దీనికి రింకు నవ్వుతూ 'వద్దు వద్దు, రింకు పేరే ఉండనివ్వండి. అదే బాగుంది' అని రిప్లై ఇచ్చాడు. దీనికి నెటిజన్లు అతడని ప్రశంసిస్తున్నారు. రింకు సింపుల్ మ్యాన్ అని కామెంట్లు పెడుతున్నారు. అయితే మ్యాచ్?లో రింకు బ్యాటింగ్?కు వచ్చే సమయానికి జట్టు 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లోఉంది. దీంతో భారీ షాట్లకు పోకుండా స్కోర్ బోర్డును ముందుకు నడిపించడంపైనే దృష్టి పెట్టినట్లు రింకు చెప్పాడు. ఎలాగైనా చివరి బంతి దాకా క్రీజులో ఉండాలని భావించినట్లు తెలిపాడు. చెత్త బంతులను మాత్రమే బౌండరీలకు తరలించాలనుకున్నట్లు వివరించాడు. వాస్తవానికి కేకేఆర్ ఇన్నింగ్స్ ప్రారంభమైన తీరు– ముగిసిన విధానానికి చాలా తేడా ఉంది. దానికి కారణం రింకునే. అతడు క్రీజులోకి వచ్చే సరికి కేకేఆర్ 7 ఓవర్లకు 37–4తో ఉంది. ఇక 11 ఓవర్లు ముగిసేసరికి 73–6తో నిలిచింది. ఈ దశలో కేకేఆర్ 120 స్కోర్ అయినా చేస్తుందా అనిపించింది. కానీ రింకు చాలా ఓపిగ్గా ఆడాడు. అస్సలు భారీ షాట్లకు పోకుండా సింగిల్స్?పైనే దృష్టి పెట్టాడు. ఈ క్రమంలోనే హాఫ్ సెంచరీ కంప్లీట్ చేసుకున్నాడు. ఇక చివరి రెండు ఓవర్లలో రెచ్చిపోయాడు. 19ఓవర్లో 17 పరుగులు రాగా, దిగ్వేశ్ వేసిన ఆఖరి ఓవర్లో నాలుగు సిక్స్?లు బాదేశాడు. దీంతో జట్టు స్కోర్ 150 దాటింది. ఓవరాల్?గా 51 బంతుల్లో అతడు 83 పరుగులు చేశాడు. బ్యాటింగ్?లోనే కాదు ఫీల్డింగ్?లోనూ రింకు తన మార్క్ చూపించాడు. మైదానంలో చురుగ్గా కదులుతూ ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే నాలుగు క్యాచ్? (మార్?క్రమ్, ముకుల్ చౌదరి, హిమ్మత్ సింగ్, జార్జ్ లిండే)లు అందుకున్నాడు. ఇక సూపర్ ఓవర్?లో మార్?క్రమ్? ?క్యాచ్?ను అందుకున్న విధానం వేరే లెవెల్. మార్?క్రమ్ భారీ షాట్? సిక్స్? వైపునకు వెళ్తుండగా పావెల్ కళ్లుచెదిరే తీరిలో అడ్డుకున్నాడు. ఈ క్రమంలోనే బంతిని మైదానంలోకి విసిరేశాడు. సడెన్?గా వచ్చిన బంతిని రింకు అందుకున్నాడు. దీనిపైనా రింకు మాట్లాడాడు. 'చిన్నప్పటి నుంచి ఫీల్డింగ్ అంటే నాకు ఇష్టం. ఇక చివర్లో ఆ క్యాచ్?ను పావెల్ పట్టేస్తాడనుకున్నా. కానీ ఆయన సడెన్?గా బంతిని నా వైపునకు విసిరాడు. నేను కూడా అంతే చురుగ్గా స్పందించి క్యాచ్ కంప్లీట్ చేశా' అని అన్నాడు. కాగా, రింకు విన్నింగ్ ఇన్నింగ్స్?పై రింకు సింగ్ కాబోయే భార్య ప్రియా సరోజ్ ఎమోషనల్ అయ్యారు. రింకు ఆడిన ఈ ఇన్నింగ్స్?? తమ మామగారి (రింకు తండ్రి)కి అంకితం అని అన్నారు. 'ఈ విజయం పట్ల సంతోషంగా ఉన్నాను. రింకు ఇవాళ ఆడిన ఇన్నింగ్స్? తన తండ్రికి అంకితం. ఆయనను మేం బాగా మిస్ అవుతున్నాం' అని ప్రియా సరోజ్ అన్నారు. ఈ వీడియోను కేకేఆర్ తమ ఎక్స్?లో పోస్ట్ చేసింది. అయితే ఇటీవల అనారోగ్యంతో రింకు తండ్రి మరణించారు.

### అంగ్క్రిష్ రఘువంశీకి భారీ జరిమానా

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా, లక్నో జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కోల్‌కతా ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో అంగ్క్రిష్ రఘువంశీ విచిత్రమైన రీతిలో అవుట్ అయ్యాడు. అంపైర్లు అతడిని 'ఫీల్డింగ్‌కు ఆటంకం కలిగించడం' (అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్) అనే నిబంధన కింద అవుట్‌గా ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఏమాత్రం ఏకీభవించని రఘువంశీ, మైదానంలోనే తన అసహనాన్ని ప్రదర్శించాడు. పెవిలియన్ వైపు వెళ్లే క్రమంలో ఆగ్రహంతో తన బ్యాట్‌ను బౌండరీ లైన్‌పై బలంగా కొట్టడమే కాకుండా, హెల్మెట్‌ను కూడా విసిరికొట్టాడు. రఘువంశీ ప్రవర్తనను తీవ్రంగా పరిగణించిన ఐపీఎల్ పాలక మండలి, అతను ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2ను ఉల్లంఘించినట్లు తేల్చింది. లెవల్ 1 నేరం కింద అతనికి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించడంతో పాటు, ఒక డిమెరిట్ పాయింట్‌ను కూడా కేటాయించింది. క్రికెట్ పరికరాలను దుర్వినియోగం చేయడం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. మ్యాచ్ రెఫరీ విధించిన ఈ శిక్షను రఘువంశీ అంగీకరించాడు. ఈ అవుట్ ద్వారా రఘువంశీ ఐపీఎల్ చరిత్రలో ఒక అవాంఛిత రికార్డును మూటగట్టుకున్నాడు.

# ఐపీఎల్ 2026 సీజన్‌లో అంపైర్ల తప్పిదాలు

ఐపీఎల్ 2026 సీజన్‌లో అంపైర్ల తప్పిదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఆదివారం ఏప్రిల్ 26న లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్  మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక భయంకరమైన పొరపాటు జరిగింది. ఈ పొరపాటు జరగకపోయి ఉంటే సంజీవ్ గోయెంకా టీమ్ లక్నో ఎప్పుడో గెలిచేది. కానీ అంపైర్ చేసిన చిన్న తప్పు వల్ల మ్యాచ్ టై అయ్యి సూపర్ ఓవర్ వరకు వెళ్ళింది. తీరా సూపర్ ఓవర్‌లో లక్నో ఓడిపోవాల్సి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కోల్‌కతా విధించిన 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు 12వ ఓవర్లో అన్యాయం జరిగింది. కేకేఆర్ బౌలర్ కార్తీక్ త్యాగి వేసిన ఆ ఓవర్ మొదటి బంతికి రిషబ్ పంత్ ఒక భారీ షాట్ ఆడాడు. బంతి క్లియర్‌గా బౌండరీ లైన్ అవతల పడింది. టీవీ గ్రాఫిక్స్‌లో కూడా అది 63 మీటర్ల సిక్సర్ అని చూపించారు. కానీ మైదానంలోని అంపైర్ మాత్రం దాన్ని ఫోర్‌గా ప్రకటించాడు. స్కోరు బోర్డులో కూడా 4 పరుగులే కౌంట్ చేశారు. ఆ సమయంలో లక్నో బ్యాటర్లు గానీ, మేనేజ్‌మెంట్ గానీ దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. అంపైర్ చేసిన ఆ చిన్న పొరపాటు వల్ల లక్నోకు నేరుగా 2 పరుగులు నష్టం వాటిల్లింది. మ్యాచ్ చివరలో అదే పెద్ద మైనస్ అయ్యింది. నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి లక్నో స్కోరు సరిగ్గా కోల్‌కతా స్కోరుకు సమానమై మ్యాచ్ టై అయ్యింది. ఒకవేళ ఆ 12వ ఓవర్లో అంపైర్ సిక్సర్ ఇచ్చి ఉంటే, లక్నో మరో బంతి మిగిలి ఉండగానే విజయం సాధించేది. మ్యాచ్ సూపర్ ఓవర్ వరకు వెళ్లేదే కాదు. కానీ అదృష్టం కలిసి రాక సూపర్ ఓవర్‌లో కేకేఆర్ చేతిలో లక్నో చిత్తయ్యింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో ఫ్యాన్స్ అంపైర్లపై విరుచుకుపడుతున్నారు. "కోట్ల రూపాయలు వెచ్చించి టెక్నాలజీ వాడుతున్నప్పుడు ఇలాంటి పొరపాట్లు ఎలా జరుగుతాయి?" అని ప్రశ్నిస్తున్నారు. లక్నో యజమాని సంజీవ్ గోయెంకా కూడా ఈ విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. గెలిచే మ్యాచ్ అంపైర్ల నిర్లక్ష్యం వల్ల చేజారిపోవడంతో లక్నో అభిమానులు నిరాశలో మునిగిపోయారు. మ్యాచ్ టై అయిన తర్వాత జరిగిన సూపర్ ఓవర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుతంగా రాణించింది. లక్నో బ్యాటర్లను కట్టడి చేయడమే కాకుండా, లక్ష్యాన్ని సులభంగా ఛేదించి పాయింట్ల పట్టికలో దూసుకెళ్లింది. ఏది ఏమైనా, ఈ మ్యాచ్ ఫలితం కంటే అంపైర్ చేసిన ఆ తప్పుడు నిర్ణయమే ఇప్పుడు ఐపీఎల్ 2026లో హాట్ టాపిక్ గా మారింది. ఇకనైనా థర్డ్ అంపైర్ జోక్యం చేసుకుని ఇలాంటి పొరపాట్లను సరిదిద్దాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# చిన్నస్వామి స్టేడియం భద్రతాపై తీవ్ర ఆందోళన

కర్ణాటక రాజధాని బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం భద్రతా పరంగా తీవ్ర ఆందోళన కలిగించే ఘటనకు వేదికగా మారింది. ఏప్రిల్ 24న ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ సందర్భంగా స్టేడియంలోని సీసీటీవీ నిఘా వ్యవస్థను దుండగులు పూర్తిగా ధ్వంసం చేశారు. దీనివల్ల ఏకంగా 240 కెమెరాలు పనిచేయకుండా పోవడంతో,మ్యాచ్ సమయంలో కీలకమైన సెక్యూరిటీ జోన్‌లలో నిఘా వ్యవస్థ స్తంభించిపోయింది. వేల సంఖ్యలో అభిమానులు హాజరయ్యే ఇలాంటి హై–ప్రొఫైల్ మ్యాచ్‌లో నిఘా లేకపోవడం పెను ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా చిత్రదుర్గ జిల్లాకు చెందిన మంజునాథ్(37), యూపీకి చెందిన అబ్దుల్ కలాం(19)లను పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. వీరు ఐవీఎస్  డిజిటల్ సొల్యూషన్స్ అనే సంస్థ కింద సబ్–వెండర్లుగా పనిచేస్తున్నారు. ఈ సంస్థ మ్యాచ్ రోజుల్లో స్టేడియంలో డిజిటల్ సేవలను అందిస్తుంది. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం.. నిందితులిద్దరూ సరైన పాస్‌లు లేకుండానే నిషిద్ధ ప్రాంతమైన సీసీటీవీ కంట్రోల్ రూమ్‌లోకి ప్రవేశించారు. అక్కడ ఉన్న నెట్‌వర్క్ వీడియో రికార్డర్  సిస్టమ్‌లను, కీలకమైన ఫైబర్ కనెక్షన్లను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసి.. మొత్తం నిఘా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. పోలీసు విచారణలో నిందితులు వెల్లడించిన కారణాలు పోలీసులను షాక్‌కు గురిచేశాయి. తాము చేసిన పనికి సంబంధించి సుమారు రూ. 10 లక్షల బకాయిలు తమకు రావాల్సి ఉందని, వాటిని చెల్లించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని వారు పేర్కొన్నారు. పదేపదే అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతోనే.. కసి తీర్చుకోవడానికి ఈ విధ్వంసానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. కేవలం ఆర్థిక లావాదేవీల గొడవ వల్ల ఏకంగా స్టేడియం భద్రతనే పణంగా పెట్టడం అధికారులను విస్మయానికి గురిచేసింది. దీనివల్ల స్టేడియం ఎంట్రీ గేట్లు, పార్కింగ్ ప్రాంతాలు, గ్యాలరీల్లో నిఘా లేకుండా పోయింది. ఈ విధ్వంసం కారణంగా స్టేడియం ఎంట్రీ గేట్లు, పార్కింగ్ ప్రాంతాలు, గ్యాలరీల్లో అమర్చిన కెమెరాలు మొరాయించాయి. దీనివల్ల భద్రతా విధుల్లో ఉన్న పోలీసులకు లైవ్ ఫీడ్ అందలేదు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే గుర్తించే అవకాశం లేకుండా పోవడంతో భద్రతా అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. స్టేడియం అంతటా ఏఐ ఆధారిత నిఘా సేవలు అందించే స్టాక్యూ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధి ఆదిత్య భట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నస్వామి స్టేడియం వద్ద గతంలో జరిగిన విషాదం ఇంకా పచ్చిగానే ఉంది. గతేడాది ఆర్సీబీ జట్టు విజయోత్సవాల వేళ దాదాపు 5 లక్షల మంది అభిమానులు ఒక్కసారిగా స్టేడియం పరిసరాలకు చేరుకోవడంతో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భద్రతా కారణాల దృష్ట్యా ఏప్రిల్ 24 మ్యాచ్‌ను రద్దు చేయాలని పోలీసులు భావించినట్లు తెలుస్తోంది. నిఘా కెమెరాలు లేని స్టేడియంలో లక్ష మంది ప్రాణాలకు రక్షణ కల్పించడం సాధ్యం కాదని అధికారులు హెచ్చరించారు. ఒకవేళ మ్యాచ్ రద్దు అయి ఉంటే, అది కేవలం ఆర్థికంగానే కాకుండా ఆర్సీబీ ప్రతిష్టకు పెద్ద దెబ్బ అయ్యేది. టికెట్ల రీఫండ్, బ్రాడ్‌కాస్టర్ల నష్టం, అభిమానుల ఆగ్రహం వల్ల బెంగళూరులో శాంతిభద్రతల సమస్య ఏర్పడే ప్రమాదం ఉండేది.

# ప్రపంచ రికార్డుకు 11 పరుగుల దూరంలో కోహ్లీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు విరాట్ కోహ్లీ మొదటి నుంచి వెన్నెముకగా నిలిచాడు. ఈ స్టార్ బ్యాటర్ ఇప్పుడు మరో అద్భుతమైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. నేడు అనగా ఏప్రిల్ 27న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ)తో జరగనున్న మ్యాచ్‌లో.. ఐపీఎల్ చరిత్రలో ఇంతవరకు ఎవరూ సాధించని ఘనతను కోహ్లీ అందుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన వారి జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. అతను నేడు జరిగే మ్యాచ్‌లో కేవలం 11 పరుగులు చేస్తే.. ఐపీఎల్ చరిత్రలో 9,000 పరుగులు పూర్తి చేసిన ప్రపంచంలోనే మొదటి బ్యాట్స్‌మన్‌గా నిలుస్తాడు. ఇప్పటివరకు 274 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ, 39.95 సగటుతో 8,989 పరుగులు సాధించాడు. ఇందులో 8 అద్భుతమైన సెంచరీలు, 66 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్ పరుగుల రేసులో ప్రస్తుతం కోహ్లీకి ఎవరూ సాటిలేరు. రెండో స్థానంలో ఉన్న రోహిత్ శర్మ, 276 మ్యాచ్‌లలో 7,183 పరుగులు సాధించాడు. అంటే కోహ్లీ, రోహిత్‌ల మధ్య 1,800 పరుగులకు పైగా భారీగా గ్యాప్ ఉంది. ఈ లీగ్‌లో ఇప్పటివరకు ఏ ఇతర బ్యాట్స్‌మెన్ కూడా 8,000 పరుగుల మార్కును దాటకపోవడం కోహ్లీ ఆధిపత్యానికి నిదర్శనం. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అతను కేవలం 7 మ్యాచ్‌లలోనే 54.57 సగటుతో 328 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు. అతను ఇప్పటికే తన బ్యాట్‌తో 36 ఫోర్లు, 12 సిక్సర్లు బాది ప్రత్యర్థి బౌలర్లకు ముచ్చెమటలు పట్టిస్తున్నాడు. ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే, నేటి మ్యాచ్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతోంది. ఇది విరాట్ కోహ్లీ



పెరిగిన సొంత మైదానం. ఇక్కడి పిచ్, ఫీల్డ్‌లోని ప్రతి మూల గురించి అతనికి క్షుణ్ణంగా తెలుసు. గత సీజన్‌లో ఢిల్లీలో ఆర్సీబీ తరఫున అద్భుతమైన ప్రదర్శన చేసిన కోహ్లీ, ఈరోజు కూడా జట్టుకు విజయాన్ని అందించేందుకు ఒక పెద్ద ఇన్నింగ్స్ ఆడతానని ధీమాతో ఉన్నాడు. ఐపీఎల్‌లో 9,000 పరుగులు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా నిలిచే అవకాశం. విరాట్ 274 మ్యాచ్‌లలో 8,989 పరుగులు చేశాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక సెంచరీలు (8) సాధించాడు. తమ అభిమాన ఆటగాడు ఈ అరుదైన మైలురాయిని చేరుకుని, జట్టును ప్లే–ఆఫ్స్‌కు చేర్చాలని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులు ఆశిస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్

## చంద్రబాబు ఆదేశాలతో కదిలిన అధికారులు

### బంకుల్లోకి చేరుతున్న పెట్రో, డీజిల్

### రవాణా వ్యవస్థకు ఆటంకం రావద్దన్న మంత్రి

అమరావతి,ఏప్రిల్27 : ఇంధన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. గత నాలుగు రోజుల నుంచి నందిగామలో డీజిల్, పెట్రోల్ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం ఆదేశాలతో నందిగామలో పలు బంకులకు పెట్రోల్, డీజిల్ చేరింది. పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు భారీగా క్యూ కట్టారు. సోమవారం సాయంత్రానికి అన్ని బంకులకు పెట్రోల్, డీజిల్ చేరుతుందని అధికారులు స్పష్టం చేశారు. పెట్రోల్ బంక్ నుంచే అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇంధన సమస్యతో రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. క్యానుల్లో కొట్టాలంటే వీఆర్వో దగ్గర లెటర్ తీసుకోవాలని అధికారులు తెలిపారు. తమను పట్టించుకోవట్లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు వీఆర్వో లెటర్ కావాలంటే అది తీసుకువచ్చి ఎప్పుడు కొట్టించుకోవాలని రైతన్నలు ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ రవాణా సేవలు ఆగకూడదని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. రవాణా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశర చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రవాణా సంస్థలు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ, ప్రయాణికుల సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సులు, ఇతర రవాణా సేవలు నిరంతరంగా కొనసాగించాలని వ్యాఖ్యానించారు. రవాణా సంస్థలు, ప్రైవేట్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఆందోళన చెందకుండా తమకు సహకరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

## తాడిపత్రిలో హిజ్రా అనుమానాస్పద మృతి

### ప్రత్యర్థి వర్గం హత్య చేసి ఉంటుందని అనుమానం

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు

అనంతపురం,ఏప్రిల్27 : అనంతపురం జిల్లా తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మల్లిక అనే హిజ్రా రైల్వే గేట్ పట్టాలపై శవమై కనిపించడం స్థానికంగా కలకలం సృష్టించింది. ఇది ముమ్మాటికీ హత్యేనని తోటి హిజ్రాలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణానికి చెందిన మల్లిక అనే హిజ్రా ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు హిజ్రాలు ఆమెను ఆటోలో బలవంతంగా తీసుకువెళ్లినట్లు సమాచారం. మల్లికను ఆటోలో తీసుకువెళ్తున్న దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వీడియో ఆధారాలు ఇప్పుడు కేసు విచారణలో అత్యంత కీలకంగా మారాయి. ఈ ఫుటేజీ ఆధారంగానే పోలీసులు నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఆదివారం రాత్రి చల్లవారిపల్లి రైల్వేగేట్ సమీపంలోని పట్టాలపై ఓ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అది మల్లిక మృతదేహంగా గుర్తించారు. మల్లిక మరణ వార్త తెలియడంతో తోటి హిజ్రాలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. మల్లికను పక్కా పథకం ప్రకారం కిడ్నాప్ చేసి, ప్రత్యర్థి గ్రూపునకు చెందినవారే దారుణంగా హతమార్చారని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు రంగంలోకి దిగి విచారణ వేగవంతం చేశారు. మల్లిక మృతికి సంబంధించి అనుమానితులుగా భావిస్తున్న శిరీష, సంగీత, రాధ అనే ముగ్గురు హిజ్రాలును అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. హిజ్రా వర్గాల మధ్య ఉన్న గ్రూపు తగాదాలే ఈ హత్యకు దారితీశాయా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాడిపత్రిలో హిజ్రాల మధ్య తలెత్తిన ఈ ఘర్షణ మరణానికి దారితీయడం చర్చనీయాంశంగా మారింది. మల్లిక మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె అనుచరులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్నికల్లో 'మా-మాటి-మానుష్' దే విజయం

### విభజన శక్తులను తిప్పికొట్టాల్సిన అవసరం ఇదే

### బెంగాల్ ప్రజలను కోరిన సిఎం మమతా బెనర్జీ

కోల్‌కతా : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 'మా-మాటి-మానుష్' (తల్లి, నేల, ప్రజలు) విజయం ఖాయమని ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని రక్షించుకోవాలని, విభజన శక్తులను తిప్పికొట్టాలని ఓటర్లను కోరారు. 'మా-మాటి-మానుష్ ఇక అంచనాలకు సంబంధించిన విషయం కాదు, కాలమే సమాధానమిస్తుంది' అని అన్నారు. ఆదివారంనాడు తాను జరిపిన పాదయాత్రకు విశేషంగా స్పందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడత ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం 6 గంటలకు తెరపడనుండటంతో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రజలను ఉద్దేశించి మమతాబెనర్జీ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఐకమత్యం, సంస్కృతి, నాగరికత బెంగాల్‌కు గర్వకారణమని, బెంగాల్ వారసత్వాన్ని దిగజార్చాలనుకునే విభజన, విధ్వంసకర శక్తులకు రాష్ట్రంలో చోటులేదని పరోక్షంగా బీజేపీని ప్రస్తావిస్తూ మమతా బెనర్జీ ఘాటుగా విమర్శించారు. బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నలుదిశలకు విస్తరిస్తున్న తరుణంలో ఏ దుష్టశక్తి దానిని అడ్డుకోలేదని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలు బెంగాల్ ప్రజలకు రక్షణకవచమని, వీటిని అడ్డుకోవడం భూప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, శాంతి, ప్రగతికి అండగా ప్రజలు నిలబడతారనే నమ్మకం తనకు ఉందని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. 'మన భాష, మన సంస్కృతి, గర్వించదగిన ఈ నేల వారసత్వాన్ని మనం పరిరక్షించుకోవాలి. కులం, మతం, భాష, నేపథ్యంతో సంబంధం లేకుండా ఈనెల 29న ప్రజలంతా జోరఫూల్ గుర్తుకు ఓటు వేసి మా-మాటి-మనుష్ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలి' అని మమతా బెనర్జీ కోరారు. భవానీపూర్ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈనెల 29న జరుగనున్న తుది విడత పోలింగ్‌లో భవానీపూర్ నియోజకవర్గం కూడా ఉంది. రెండు విడతలుగా నిర్వహిస్తున్న ఈ పోలింగ్‌లో తొలి విడత పోలింగ్ ఈనెల 23న జరిగింది. అనూహ్యంగా 93 శాతం పోలింగ్ నమోదైంది. అయితే భారీ పోలింగ్ తమకే అనుకూలమని, పోలింగ్ జరిగిన 152 నియోజకవర్గాల్లో 110 స్థానాలను తాము గెలుచుకోనున్నామని బీజేపీ ధీమా వ్యక్తం చేసింది.

# మక్కజొన్న రైతులను ఆదుకోండి

### వెంటనే కొనుగోలుకు ఏర్పాటు చేయండి

### ధర్య వ్యత్యాసం కూడా వారికి చెల్లించాలి

### కేంద్రమంత్రి చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ



అమరావతి,ఏప్రిల్27 : ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న రైతులకు ధరల వ్యత్యాస చెల్లింపు పథకాన్ని వర్తింప చేయాలని విన్నవించారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఆందోళనగా ఉన్నారు. మార్కెట్‌లో ఈ పంట ధర రోజురోజుకూ పడిపోతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్న ధర రూ.1,600 నుంచి రూ.1,700 మధ్య మాత్రమే ఉంది. కనీస మద్దతు ధర రూ.2,400 కంటే చాలా తక్కువగా ప్రస్తుత మార్కెట్ ధర ఉంది. రాష్ట్రంలో సుమారు 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇంకా 14.26 లక్షల మెట్రిక్ టన్నుల పంట కోత దశలో ఉంది. కాలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే రైతులు నష్టపోతారు. మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రం నుంచి మద్దతు లేకపోవడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతుంది. పిఎం-ఆశా కింద ధరల వ్యత్యాసాన్ని నేరుగా రైతులకు చెల్లించాలి. ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిగణించి, ధరల వ్యత్యాసంలో 100 శాతం నిధులను కేంద్రమే భరించాలి. ఈ పథకాన్ని జూన్ 2026 వరకూ పొడిగించాలి. నాఫెడ్, ఏపీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు తక్షణమే అనుమతులివ్వాలి' అని సీఎం చంద్రబాబు లేఖలో కోరారు.

## విజయం కన్నా వైఫల్యాలే పాఠాలు నేర్పుతాయి

### జీవితంలో కృషి, పట్టుదల ఉంటే ఏదయినా సాధించవచ్చు

### ఆంధ్రా వర్సిటీ ప్రపంచప్రఖ్యాత వర్సిటీగా ఎదగాలి

### శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

విశాఖపట్నం,ఏప్రిల్27 : కృషి, పట్టుదల ఉంటే ప్రతిదీ సాధ్యమేనని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. మనసు ఉంటే మార్గం ఉంటుందని.. విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువ నేర్పుతాయని అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. విద్యారంగంలో ఏయూ ముందుందని రాధాకృష్ణన్ తెలిపారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ప్రముఖ విద్య సంస్థగా ఏయూ ఎదగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. జీవితంలో కృషి, పట్టుదలతో అన్నీ సాధించవచ్చని ఈ సందర్భంగా విద్యార్థులకు ఉప రాష్ట్రపతి సూచించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ప్రశంసించారు. మరోవైపు ఆంధప్రదేశ్ కూటమి ప్రభుత్వంపైనా ప్రశంసలు కురిపించారు రాధాకృష్ణన్. గూగుల్‌ను విశాఖకు తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. దీనికి కృషి చేసిన ఏపీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించి స్థిరమైన అభివృద్ధికి నాంది పలికారని కొనియాడారు. గడిచిన ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీ సాధించిందని రాధాకృష్ణన్ తెలిపారు. ఇది ప్రభుత్వ పారదర్శకత, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రతిబింబిస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో విశాఖ గ్లోబల్ డెస్టినేషన్‌గా మారుతుందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. ఏయూలో చదువుకుని ఎందరో ఉన్నత స్థానాలకు వెళ్లారని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఈ విశ్వ విద్యాలయం మరిన్ని మైలురాళ్లు సాధించాలని ఆకాంక్షించారు. వందేళ్ల ప్రయాణంలో ఏయూ సమాజానికి ఎంతో సేవ చేసింది. అనేక మంది ఏయూ విద్యార్థులు దేశ రాజకీయాల్లో రాణించారు. నాణ్యమైన విద్య అందించడంలో ఈ విశ్వవిద్యా లయానికి మంచి పేరు ఉందని ఉపరాష్ట్రపతి కొనియాడారు. అంతకుముందు విశాఖ చేరుకున్న ఉపరాష్ట్రపతికి మంత్రి లోకేశ్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

## ఎపికి పెట్టుబడులు రావడంతో జగన్‌కు ఈర్ష్య

### ఐదేళ్ల పాటు డార్క్ రూమ్ పాలనతో గడిపారు

### జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి,ఏప్రిల్27 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, పరిశ్రమలు చూసి మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ మండిపడ్డారు. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు డార్క్ రూమ్ పాలన చేసిన జగన్.. గొప్ప క్రెడిట్ సాధించారని అన్నారు. జగన్ క్రెడిట్లను ఏపీ ప్రజలు తట్టుకోలేక అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పినా జగన్ మాత్రం విష ప్రచారాలు ఆపట్లేదని మంత్రి వాసంశెట్టి ఆగ్రహించారు. మునుపెన్నడూ చూడని వింత ప్రవర్తనతో జగన్ సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారని మంత్రి వాసంశెట్టి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆంధప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు చూసి ఓర్వలేక జగన్ బాధపడుతున్నారని చెప్పారు. క్రెడిట్ చోరీలో జగన్ సిద్ధహస్తుడంటూ విమర్శలు గుప్పించారు మంత్రి. ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని నాశనం చేసిన క్రెడిట్ జగన్‌కు మాత్రమే సొంతమన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేయడంతో పాటు అన్ని రంగాలను నాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు మొదలు.. చిన్న కంపెనీల వరకూ యాజమాన్యాన్ని వేధించారని మంత్రి ఆరోపించారు. దాదాపు 40కి పైగా కంపెనీలను ఏపీ వదిలి పారిపోయేలా చేసిన క్రెడిట్ జగన్‌దే అని మంత్రి వాసంశెట్టి ఆరోపించారు. హత్యా రాజకీయాలు, కల్తీ మద్యం, ఇసుక అక్రమ దందా ఇలా జగన్, ఆయన అనుచరుల క్రెడిట్‌ను ఎవరూ కాపీ చేయలేరని అన్నారు. జగన్ తన మానసిక బాధ తగ్గించుకునేందుకు యోగా లాంటి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని మంత్రి వాసంశెట్టి వ్యంగ్యంగా అన్నారు.

## విశాఖ అభివృద్ధికి చంద్రబాబు కృషి

### లోకేశ్ చొరవతోనే అనేక పరిశ్రమలు రాక

### ఉత్తరాంధ్ర అభివృద్ధిని దెబ్బతీసిన జగన్

### ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ విమర్శలు

అమరావతి,ఏప్రిల్27 : ఉత్తరాంధ్ర అభివృద్ధి, విశాఖ నగర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. 2014లోనే విశాఖతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. విశాఖను ఐటీ, ఏఐ గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దాలని అప్పుడే సంకల్పించారని అనురాధ పేర్కొన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిని దెబ్బతీసిందని ఎమ్మెల్సీ అనురాధ ఆరోపించారు. వైసీపీ పాలనలో విశాఖను గంజాయి హబ్‌గా మార్చారని, ఉత్తరాంధ్రలో భూ కబ్జాలు, కిడ్నాప్‌లు, లిక్కర్ మాఫియాలు పెరిగాయని తీవ్ర విమర్శలు గుప్పించారు. అవినీతి వాటాల కోసం వైసీపీ ఎంపీలు తమ కుటుంబసభ్యులనే ఒకరినొకరు కిడ్నాప్‌లు చేసుకున్నారని ఎమ్మెల్సీ ఆరోపించారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆమె ప్రశంసించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకువస్తున్నారని ఎమ్మెల్సీ అనురాధ చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ కఠోర శ్రమ ఫలితంగానే రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చిందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. విశాఖలో ఈ డేటా సెంటర్ శంకుస్థాపన దేశ చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1.80 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఎమ్మెల్సీ వివరించారు. అయితే ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకోవడానికి వైసీపీ నేతలు కోర్టులను ఆశ్రయించారని, చనిపోయిన రైతుల పేర్లతో పిటిషన్లు దాఖలు చేశారని ఆగ్రహించారు. కంపెనీలకు రాయితీలు ఇవ్వొద్దని కోర్టుకు వెళ్లడం ద్వారా పెట్టుబడులను అడ్డుకునేందుకు యత్నించారని ఆరోపించారు. గూగుల్ డేటా సెంటర్‌ను గోడౌన్‌తో పోల్చడం వైసీపీ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖకు జగన్ రెడ్డి ఒక్క పెద్ద పరిశ్రమ కూడా తీసుకురాలేదని ఎమ్మెల్సీ అనురాధ మండిపడ్డారు. జగన్ తన కోసం విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించుకోవడం తప్ప రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ కొనియాడారు.

## రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం

### విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేలా చర్యలు

### విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి,ఏప్రిల్27 : విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యూనిట్ ధరను రూ.4.60కు తగ్గించేలా కసరత్తు చేస్తోంది. సోమవారం నాడు విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈవీ వాహనాల వినియోగంపై ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాల అమలులో లక్ష్యాలు చేరుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. విద్యుత్ వినియోగ దారులకు, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంఓయూలు కుదుర్చుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## స్నేహితుల మధ్య గొడువ

### ఒకిరిపై దాడి చేసి హత్య

అనంతపురం,ఏప్రిల్27 : అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఆదివారం రాత్రి ఒక చిన్న వివాదం పెను విషాదానికి దారితీసింది. కేవలం బైక్ తాళం విషయంలో మొదలైన వాగ్వాదం, ఓ యువకుడి ప్రాణాలను తీసింది. స్నేహితుల మధ్య జరిగిన ఈ ఘర్షణ స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తాడిపత్రి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణంలోని బంకమట్టి కాలనీకి చెందిన దూదేకుల అబ్దుల్లా, భాష, గౌస్, కార్తీక్‌లు ప్రాణస్నేహితులు. రోజూ వీరంతా కలిసి సరదాగా గడిపేవారు. ఆదివారం రాత్రి వీరి మధ్య ఓ చిన్న విషయంలో మనస్పర్థలు వచ్చాయి. అబ్దుల్లాకు చెందిన బైక్ తాళంచెవిని అతని స్నేహితులు కింద పడవేశారు. ఈ చిన్న విషయంలో అబ్దుల్లాకు ఆయన స్నేహితులైన కార్తీక్, గౌస్‌ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం మొదలైంది. ఒకరినొకరు దూషించుకోవడంతో గొడవ ముదిరింది. మాట మాట పెరగడంతో ఆవేశానికి లోనైన గౌస్, కార్తీక్‌లు అబ్దుల్లాపై అమానుషంగా ప్రవర్తించారు. విచక్షణ కోల్పోయి పక్కనే ఉన్న పదునైన నాపరాళ్లను తీసుకుని అబ్దుల్లాపై దాడికి దిగారు. ఈ దాడిలో తల, ఇతర భాగాల్లో బలమైన గాయాలు కావడంతో అబ్దుల్లా తీవ్ర రక్తస్రావానికి గురయ్యాడు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అబ్దుల్లా అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న తాడిపత్రి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన గౌస్, కార్తీక్‌లను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, హత్యకు గల పూర్తి కారణాలు, ఆ సమయంలో అక్కడ ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. అబ్దుల్లా మరణంతో బంకమట్టి కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


## శేషాచల కొండల్లో కార్చిచ్చు

తిరుపతి,ఏప్రిల్27 : శేషాచల కొండల్లో కార్చిచ్చు రేగింది.తిరుపతి శివారు ప్రాంతమైన జీవకోన పైభాగంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో అనూహ్యంగా మంటలు చెలరేగాయి. ఆ అగ్నిజ్వాలలు కిలోమీటర్లమేర వ్యాపించడంతో అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే రాత్రి 10గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదు.రాత్రికే మంటలను అదుపులోకి తీసుకొస్తామని తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు.మంటలు ఎలా వ్యాపించాయనేది తెలియాల్సి ఉందన్నారు.

## విశాఖకు చేరుకున్న లోకేశ్

### ఘనంగా స్వాగతం పలికిన టిడిపి నేతలు

విశాఖపట్నం,ఏప్రిల్27 : విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఘనంగా స్వాగతం లభించింది. నగరానికి విచ్చేసిన మంత్రికి టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. టీడీపీ నేత చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్ (వైజాగ్)' అంటూ ప్లకార్డులు పట్టుకుని ఘనంగా స్వాగతించారు. ఎయిర్‌పోర్టు వద్ద మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు, గూగుల్ ప్రతినిధుల తేనీటి విందులో పాల్గొనేందుకు నగరానికి లోకేశ్ వచ్చారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. కార్యక్రమానికి హాజరుకానున్న పలువురు ప్రముఖులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్వాగతం పలకనున్నారు. మరోవైపు ఈ రోజు రాత్రి నోవాటెల్ హోటల్‌లో గూగుల్ ప్రతినిధుల గౌరవార్థం తేనీటి విందులో మంత్రి లోకేశ్ పాల్గొంటారు.




# ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత

తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.



# ఆలోచించి సినిమా చేస్తా

## నెటిజన్ కామెంట్స్‌కు నిధి ఘాటు రిప్లై

సోషల్ మీడియాలో సెలబ్రిటీల మీద అప్పుడప్పుడూ నెటిజన్లు ఇబ్బంది పెట్టే కామెంట్లు చేయడం మనం చూస్తూనే ఉంటాం. కొన్ని సార్లు సెలబ్రిటీలు వాటిని సీరియస్ గా తీసుకుని స్పందిస్తూ ఉంటారు. ఇప్పుడు నిధి అగర్వాల్ కూడా ఇలాగే సీరియస్‌గా స్పందించింది. తాజాగా ఓ పేజీలో నిధి గురించి పోస్టు చేశారు. దానిపై ఓ నెటిజన్ స్పందిస్తూ.. నిధి అగర్వాల్ ను శ్రీలీలతో పోలుస్తూ కామెంట్ చేశాడు. శ్రీలీల ఇప్పటికే చాలా సినిమాలు చేస్తోందని.. నిధి మాత్రం ఇస్మార్ట్ శంకర్ తర్వాత ఏం చేసింది అంటూ ప్రశ్నించాడు. ఈ కామెంట్ కు స్వయంగా నిధి అగర్వాల్ సీరియస్ గా స్పందిస్తూ అతనికి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చి పడేసింది. ఆమె స్పందిస్తూ.. 'ఇస్మార్ట్ శంకర్ తర్వాత హీరో సినిమా చేశాను. తమిళంలో మూడు సినిమాలు చేశాను. హరిహర వీరమల్లు సినిమాకు సైన్ చేశాను. ఆతృతతో సినిమాలు చేయాలని లేదు. ఆలోచించి మంచి సినిమాలు చేయాలని చూస్తున్నాను. నా గురించి నువ్వు అంత -టె-న్షన్ పడకు. నీ పని చూసుకో బ్రదర్' అంటూ కౌంటర్ ఇచ్చింది నిధి అగర్వాల్. ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిధి అగర్వాల్ నుంచి త్వరలోనే హరిహర వీరమల్లు సినిమా రాబోతోంది. దానిపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇది పాన్ ఇండియా సినిమాగా వస్తోంది. ఇది హిట్ అయితే నిధికి మళ్లీ అవకాశాలు పెరిగే ఛాన్స్ ఉంటుంది.



# ఇప్పట్లో పెళ్లి ప్రస్తావన లేదు: తమన్నా

మిల్కీ బ్యూటీ తమన్నా గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఈ అమ్మడు ఒకప్పుడు టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఇటీవల పెద్దగా అవకాశాలు దక్కించుకోలేకపోతున్న ఈ భామ ఐటమ్ సాంగ్స్ చేస్తూ అదరగొడుతుంది. అయితే తమన్నా కొద్ది రోజులుగా విజయ్ వర్మతో రిలేషన్‌లో ఉంది. కాని ఇటీవల అతనికి బ్రేకప్ చెప్పినట్టు- సమాచారం. విజయ్ వర్మతో డేటింగ్ వరకు ఓకే, పెళ్ళికి సిద్ధంగా లేనని చెప్పడంతో అతనితో తమన్నా బ్రేకప్ చేసుకుందని వార్తలు వినిపించాయి. అయితే తమన్నా ఇప్పుడు ఓదెల2 చిత్ర ప్రమోషన్స్‌తో బిజీగా ఉంది. ఇందులో శివశక్తి రోల్‌లో డిఫరెంట్ పాత్రలో కనిపించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పెళ్లిపై అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించారు. మీరు పెళ్లెప్పుడు చేసుకోబోతున్నారని ఇంటర్వ్యూలో అడగ్గా.. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదని చెప్పుకొచ్చింది. తమన్నా సమాధానం విని అందరు ఆశ్చర్యపోతున్నారు. ఇక తమన్నా కొంతకాలంగా బాలీవుడ్ నటు-డు విజయ్ వర్మతో ప్రేమలో మునిగి తేలింది.. వీరిద్దరికీ బ్రేకప్ అయ్యిందంటూ వార్తలు హల్చల్ చేశాయి. దీనిపై ఇద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. ఇటీవల వేర్వేరుగా ఈ ఇద్దరు ఫంక్షన్స్ కి , పార్టీలకి హాజరవుతున్నారు. దీంతో వారిద్దరు విడిపోయారని భావిస్తున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు సైతం ఇద్దరికీ బ్రేకప్ అయ్యిందనే వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. ఆఫర్లు లేకపోవడంతోనే చిన్న సినిమాల్లో నటిస్తున్నారా? అనే ప్రశ్నకు తమన్నా బదులిస్తూ.. తన దృష్టిలో చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదని.. కంటెంట్ బాగుంటే పెద్ద సినిమా అవుతుందని.. లేకుంటే చిన్న సినిమా అవుతుందని చెప్పుకొచ్చింది. ఇప్పటివరకూ సినిమాల్లో అమ్మాయిల్ని డాక్టర్‌గా, పోలీస్ ఆఫీసర్‌గా డిఫరెంట్ రోల్స్‌లో చూశాం. కానీ శివశక్తి రోల్‌ను ఎవరూ స్క్రీన్‌పై చూపించలేదు. ఇది ఓ పెద్ద బాధ్యత. శివశక్తులు ఎలా ఉంటారో ప్రజలకు తెలియాలి. ఈ సినిమా చూస్తే అసలు ఎందుకు తీశామో వారికి అర్థమవుతుందని చెప్పారు.



# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్

## సాయిపల్లవి కాదు కాదు...రుక్మిణీ వసంత్

జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ అయిన సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.




# జూన్ 25న పెద్ది విడుదల ఖాయం

## దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056